





గుంటూరు ఏసీ కళాశాల కౌంటింగ్ కేంద్రంలో ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది



కౌంటింగ్ కేంద్రంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ

పట్టభద్రుల పోరులో..
కూటమి దూకుడు

- ఒక్కో రౌండ్‌లో సగటున 10 వేలకు పైగా ఓట్ల ఆధిక్యం
- ఐదో రౌండ్ ముగిసేసరికే 47,872 ఓట్ల ఆధిక్యంలో ఆలపాటి
- ఓట్ల లెక్కింపులో తేలిపోయిన పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు

గుంటూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదు(తెలుగుదేశం) ఘన విజయం దిశగా దూసుకుపోతున్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు గుంటూరులోని ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో ఈ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. స్ట్రాంగ్ రూంల సీళ్లను అభ్యర్థులు, ఏజంట్ల సమక్షంలో తెరిచి బ్యాలెట్ బాక్సులను భద్రంగా కౌంటింగ్ హాల్‌లోకి చేర్చారు. అనంతరం ఏజంట్ల సమక్షంలో సీళ్ల తెరిచి బ్యాలెట్ పేపర్లను మిశ్రమం చేశారు. ఆ తర్వాత 50 చొప్పున కట్టలు కట్టారు. ఆర్‌వో టేబుల్ వద్ద పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కూడా తెరిచారు. మొత్తం 371 పోస్టల్ బ్యాలెట్లకు 55 చెల్లుబాటు కాలేదు. దాంతో 316 బ్యాలెట్లను తొలి రౌండ్ కౌంటింగ్‌లోకి తీసుకొచ్చారు. మొత్తం పోలింగ్ అయిన 2,41,493 ఓట్లను 50 చొప్పున 4,828 బండిల్స్(కట్టలు)గా చేశారు. మిగిలిన 93 ఓట్లతో మరో కట్ట కట్టారు. కౌంటింగ్ హాల్‌లో 28 టేబుల్స్ ఏర్పాటు చేసి ఒక్కో టేబుల్‌పైకి ఒక్కో రౌండ్‌లో 1000 ఓట్లను లెక్కింపునకు పంపారు. కౌంటింగ్ సిబ్బంది ఒక్కో కట్ట తెరిచి బ్యాలెట్ పేపర్‌ని ఏజంట్లకు చూపిస్తూ చెల్లుబాటు కాకపోతే ప్రత్యేకంగా ట్రేలో పడేసి చెల్లుబాటు అయిన తొలి ప్రాధాన్య ఓట్లను అభ్యర్థుల వారీగా వారికి కేటాయించిన ట్రేలలో అమర్చారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.29 (మంగళవారం)
సహరి : 5.10 (బుధవారం)

తొలి రౌండ్‌లోనే భారీ ఆధిక్యం

ఆలపాటి రాజేంద్రప్రసాదుకు తొలి రౌండ్‌లోనే భారీ ఆధిక్యం లభించింది. అన్ని టేబుళ్లపైనా ఆయనకు మెజార్టీ వచ్చింది. దాంతో తొలి రౌండ్‌లో 17,194 ఓట్లు ఆలపాటికి రాగా లక్ష్మణరావుకు 7214 ఓట్లు వచ్చాయి. చెల్లని ఓట్లు 3070గా ఉన్నాయి. తొలి రౌండ్‌లో 28,312 ఓట్లు లెక్కించారు. రెండో రౌండ్‌లో ఆలపాటికి 17527 ఓట్లు, లక్ష్మణరావుకు 6742 ఓట్లు వచ్చాయి. ఈ రౌండ్‌లోనూ చెల్లని ఓట్లు 3005 ఉన్నాయి. దీంతో ఆలపాటి మెజార్టీ 20765కు చేరుకొన్నది. మూడో



(మిగతా 6వ పేజీలో)

ధ్రువీకరణ పత్రం నకిలీ సిత్రం



అదొక ధ్రువపత్రం మాత్రమే. దానినే ప్రభుత్వ పట్టాగా చలామణీ చేశారు. ప్రభుత్వ, ప్రయివేటు భూములలో పాగా వేసేశారు. అది ఇంతటితో ఆగకుండా జగనన్న కాలనీలకోసం కేటాయించిన స్థలాలనే కబ్జా చేసేశారు. అర్హులైన లబ్ధిదారులకు ఒక్క సెంటు మాత్రమే జాగా ఇస్తే, వీరు ఈ పత్రాలతో ఏకంగా రెండు సెంట్ల చొప్పున సొంతం చేసుకున్నారు. తెనాలిలో ఆలస్యంగా బయటపడిన నకిలీ ధ్రువపత్రాల వ్యవహారం రెవెన్యూ శాఖ ను ఉలిక్కిపడేలా చేసింది. ఇదే తరహాలో ఒక మురా భూమికి విలువ ఎక్కువగా ఉన్న పట్టణాలు, రాజధాని ప్రాంతాల్లో ఈ తరహా నకిలీ ధ్రువపత్రాలతో ప్రభుత్వ భూముల్లో పాగా వేస్తే, అది ఎంత విస్తీర్ణం? ఎంతమంది అక్రమార్కులు దీని వెనుక దాగున్నారనేది అంతు బట్టని విషయం. పట్టా లేకున్నా కనీసం ఏదో ఒక అధికారిక ధ్రువ పత్రం ఉంది కదా! అని సరిపెట్టుకుందామంటే, అదికూడా అసలు కాదు... అచ్చుగుద్దినట్టు అసలుకు నకిలీని దింపేశారు. ఇక్కడ వీరు చేసిన తప్పేంటంటే!... ప్రతి ప్రభుత్వ ఉత్తర్వులకు కానీ, ధ్రువపత్రాలకు కానీ సంబంధిత రికార్డు నంబర్ ఉంటుంది. ఆ ఒక్క విషయాన్ని మర్చిపోయి ఏ నంబర్ కానీ కనీసం తేదీ కూడా లేకుండా తయారు చేయటమే. అదే ఈ నకిలీ పత్రాల కుంభ'కోణాన్ని' గుర్తించటానికి ఆధారమయింది. పైగా ఈ ధ్రువపత్రంలో గౌరవ శాసనసభ్యునికి అర్జీ పెట్టుకున్నారని, అందుకే స్థలాన్ని కేటాయించినట్టు పేర్కొనటం కూడా నకిలీ గుట్టు రట్టు చేసింది. అధికారానికో! లేక డబ్బుకో తలూపే అధికారులుంటే చిత్తుకాగితం కూడా హక్కు పత్రమైపోతుందనటానికిదో ఉదాహరణ. దీని ఆధారంగా ప్రభుత్వ భూములను సొంతం చేసుకోవటం కొసమెరుపైతే, వాటిలో పాగా వేసిన వారి గురించి రెవెన్యూ శాఖ అసలు పట్టించుకోకపోవటం మరో విశేషం. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ వ్యవహారం బయటకు పొక్కటంతో దీని మూలాలను ఛేదించే పనిలో పడ్డారు.

- దొంగ పత్రాలతో ప్రభుత్వ భూమి హాంఫట్!
- అవే అధికారిక పట్టాలుగా భూ ఆక్రమణ
- గత ప్రభుత్వ కాలంలో గుట్టుచప్పుడు కాకుండా భూ దందా
- ఇప్పుడిప్పుడే ఒక్కొక్కటిగా వెలుగులోకి
- ఏ స్థాయిలో ఉందనేది విచారణలో తేలాల్సిందే
- పోలీస్ కేసు పెట్టే ఆలోచనలో రెవెన్యూ అధికారులు !



పట్టా అంటూ ధ్రువీకరణ పత్రాన్ని ఇచ్చేసి, స్థలాలను అప్పనంగా దోచేసిన అక్రమార్కులు

తెనాలి, మార్చి 03, (ఆంధ్రజ్యోతి): ఒక చిత్తు కాగితం ఇక్కడ అధికారిక ధ్రువపత్రం అయిపోయింది. దీని ఆధారంగానే ప్రభుత్వ భూములను, జగనన్న కాలనీల్లోని స్థలాలను అధికారులు కట్టబెట్టారో! లేక అక్రమార్కులే దోచేశారో కానీ కబ్జాల పర్వం మాత్రం యథేచ్ఛగా సాగిపోయింది. సాధారణంగా ఒక ప్రభుత్వ భూమిని వ్యక్తులకు కానీ, లేక ప్రైవేటు సంస్థలకు కానీ కేటాయించాలంటే 2012లో విడుదల చేసిన జీఓ నంబర్ 571 ప్రకారం తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి ఉండాలి. ఇదంతా తహసీల్దార్, సబ్‌కలెక్టర్, జిల్లా కలెక్టర్ ద్వారా ప్రతిపాదన పంపాలి. చిన్నపాటి స్థలాలు కాకుండా రూ. 50 లక్షల విలువకు మించిన భూమి అయితే దానికి క్యాబినెట్ అనుమతి ఉండాలి. అయితే తెనాలిలో అవేమీ లేకుండా కేవలం ఒక ధ్రువీకరణ పత్రం పేరుతో స్థలాల హద్దులు చూపించిమరీ అప్పనంగా అప్పగించేశారు. ఇంతటి పక్కా హద్దులతో స్థలాలు కేటాయించారంటే, దీని వెనుక రెవెన్యూ శాఖలోని ఉద్యోగుల పాత్ర ఎంతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. తెనాలిలో గత తహసీల్దార్‌ల కాలంలో జరిగాయా! లేక తహసీల్దార్‌ల బదిలీ జరిగిన (మిగతా 6వ పేజీలో)

పట్టనిభద్రులు

- ఓటు వేయని లక్ష మంది
- నాలుగు రౌండ్లకే చెల్లుబాటు కాని ఓట్లు 12,088
- అన్ని రౌండ్ల లెక్కింపు పూర్తి అయితే 25 వేలు దాటిపోయే అవకాశం

గుంటూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్ అర్హత కాదు. డిగ్రీ పట్టా అందుకొని మూడేళ్ల అనుభవం దాటిన ఉన్నత విద్యావంతుల కోసం ఎన్నికల సంఘం కల్పించిన ఓటు హక్కు ఇది. అయినప్పటికీ స్పష్టమైన అవగాహన లేకుండా ఓటింగ్‌లో పాల్గొని వేల మంది తమ ఓటు చెల్లకుండా చేసుకొన్నారు. ఇంత చదువు చదివి ఓటు వేయడంపై అవగాహన లేకపోతే ఎలా అన్న విమర్శలను వివిధ వర్గాల



నుంచి మూటగట్టుకొంటున్నారు. ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గంలో ఈ సారి ఎన్నికలకు 3,47,116 మంది ఓటర్లుగా నమోదయ్యారు. వీళ్లలో 2,41,502 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకొన్నారు. దాదాపుగా లక్షా 6 వేల మందికి పైగా పట్టభద్రులు పోలింగ్ రోజున ఓటు వేయడానికి తీరిక చేసుకోలేదు. కనీసం ఓటు వేసిన వాళ్లు అయినా ఎన్నికల సంఘం నిబంధనలను ఆకళింపు చేసుకొని వేశారా అంటే అది లేదు. ఓట్ల లెక్కింపులో ప్రతీ రౌండ్‌లోనూ సగటున 3 వేల ఓట్లు చెల్లుబాటు కాకుండా పోయాయి. తొలి రౌండ్‌లో 3070, రెండో రౌండ్‌లో 3005, మూడో రౌండ్‌లో 2978, నాలుగో రౌండ్‌లో 3035 కలుపుకొని 1,12,297 ఓట్లు లెక్కించేసరికే మొత్తం 12088 ఓట్లు చెల్లుబాటు కాకుండా పోయాయి. మరో ఐదు రౌండ్ల పాటు ఓట్ల లెక్కింపు కొనసాగనున్న నేపథ్యంలో చెల్లుబాటు కాని ఓట్ల సంఖ్య 25 వేలకు చేరుకోవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ ఎన్నికల్లో అభ్యర్థులకు కేవలం 1, 2, 3... ఇలా అంకెలతో ప్రాధాన్య ఓటు వేయాలి. అయితే కొందరు రోమన్ అంకెలు, ఇంగ్లీషు పదాలు, టిక్ మార్కు, చేయడం వంటి పొరపాట్లు చేయడంతో వాళ్ల ఓట్లు చెల్లుబాటు కాకుండాపోయాయి. ఆలపాటి రాజేంద్రప్రసాదుకు భారీ మెజార్టీ వచ్చిన దృష్ట్యా చెల్లుబాటు కాని ఓట్ల సంఖ్య గురించి పెద్దగా ఎవరూ పట్టించుకోవడం లేదు. అదే ఆలపాటి, లక్ష్మణరావు మధ్యన తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు లో పోటాపోటీగా ఓట్లు పోలింగ్ అయి వుంటే ఈ చెల్లు బాటు కాని ఓట్ల గురించి అంతా చర్చించు కునే వారే.

ఇంటి నుంచి పనిచేస్తారా..?

- గడప గడపకు సర్వే
- వివరాలు సేకరిస్తున్న సచివాలయాల సిబ్బంది

గుంటూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇన్ ఫర్ మేషన్ టెక్నాలజీ(ఐటీ) సంబంధిత ఉద్యోగా లను ఇంటి వద్దనే ఉండి చేసుకొనేందుకు తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా గడప గడపకు సర్వేని ప్రారంభించింది. ఇందుకోసం ప్రత్యే క యాప్‌ని రూపొందించి గ్రామ/వార్డు సచివాల యాల కార్యదర్శుల ఫోన్లకు పంపించింది. ఆ యాప్ లో పొందుపరిచిన ప్రశ్నల ఆధారంగా సిబ్బంది వారి క్లస్టర్ పరిధిలో ఇంటింటికి వెళ్లి 18 ఏళ్ల వయస్సు దాటిన మహిళలు, పురుషుల వద్ద నుంచి వివరాలు సేకరించి నిక్షిప్తం చేస్తున్నారు. దీంతో త్వరలోనే తమకు కూటమి ప్రభుత్వం ఇంటి వద్దనే ఉండి పని చేసుకొంటూ ఆదాయం పొందే మార్గం చూపించబోతున్నదని ముఖ్యంగా మహిళలు ఆనందోత్సాహాలు వ్యక్తపరుస్తున్నారు.

సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలోనే వర్క్ ఫ్రం హోం వాతావరణాన్ని సృష్టించి అందరూ ఇంటి వద్దనే ఉండి ఉద్యోగం చేసుకొంటూ ఉపాధి పొందేలా చేస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు ఆయన ఐటీ సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నారు. చాలామంది మహిళలు చదువుకున్నా గృహిణిలుగానే ఉంటున్నారు. ఇలాంటి వారికి వర్క్ ఫ్రం హోం(డబ్ల్యూఎఫ్‌హెచ్) ఎంతగానో మేలు చేస్తుందని సీఎం భావిస్తున్నారు. ఐటీ, ఇతర ఉద్యోగులకు డబ్ల్యూఎఫ్‌హెచ్ అవకాశాలను మరింత ప్రోత్సహించేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నది. దీని వలన వేలాది మంది యువతకు



వర్క్‌ఫ్రం హోంపై డోర్ టూ డోర్ సర్వే నిర్వహిస్తున్న సచివాలయాల కార్యదర్శులు

స్వగ్రామంలోనే ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొంటున్నది. ఉద్యోగులకు కలిగే ప్రయోజనాలు, సవాళ్లు, అవసరమైన మౌలిక వసతులు వంటి అంశాలపై స్పష్టమైన అవగాహన ఏర్పరుచుకునేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. సర్వేని 18 నుంచి 50 సంవత్సరాల వయస్సు లోపు ఉన్న వారినే చేస్తున్నారు. ఎవరి పేరు అయితే హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో ఉంటుందో వారికి మాత్రమే ఈ సర్వే చేస్తున్నారు.

సర్వేలో ప్రశ్నలు ఇలా..

విద్యార్హత ఏమిటి? ప్రస్తుతం పని చేస్తున్నారా లేదా? పని చేస్తున్నట్లు అయితే వర్క్ ఫ్రం హోం సదుపాయం ఉన్నటు వంటి ఏ రంగంలో పని చేస్తున్నారు? వర్క్ ప్రొఫైల్ కింద ఇంటి వద్ద నుంచి పని చేస్తున్నారా? ఆఫీసు వద్ద నుంచి పని చేస్తున్నారా? హైబ్రిడ్ మోడల్‌లో కొంతకాలం ఇంటి వద్ద కొన్ని రోజులు ఆఫీసుకు వెళుతు న్నారా అని వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్నారు. అలానే ఇంటి వద్ద నుంచి పని చేస్తున్నట్లు అయితే మీ ఇంటిలో డబ్ల్యూఎఫ్ హెచ్ సదుపాయం ఉన్నదా? న్నట్లు అయితే మీ ఇంటిలో బ్రాడ్ బ్యాండ్ కనెక్టివిటీ అవకాశం ఉందా? కనెక్టివిటీ వుంటే మీకు ఎంత స్పీడ్‌తో ఇంటర్నెట్ సదుపాయం ఉంది? మీ ఇంట్లో డబ్ల్యూఎఫ్‌హెచ్ హోం కింద మీ స్నేహితులకు/మీ సహచరులు/తోటి ఉద్యోగులకు సదుపాయం కోసం ఇంట్లో రూం/ప్రత్యేకంగా గది ఉందా? ఉంటే ఆ గది కొలత ఎంత? ఎంతమంది వరకు డబ్ల్యూఎఫ్‌హెచ్ కింద ఆ రూంలో పని చేసే అవకాశం ఉంటుంది? ప్రస్తుతం పని చేయకపోతే ఏదైనా ఫీల్డ్‌లో పని చేసేందుకు ఇష్టం ఉన్నదా? పని చేయడం ఇష్టం ఉంటే శిక్షణ తరగతులకు హాజరవుతారా అని సచివాలయాల సిబ్బంది వివరాలు సేకరించి యాప్‌లో నిక్షిప్తం చేసి ప్రభుత్వానికి నివేదిస్తున్నారు.



ఏసి కళాశాల పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

ద్వితీయ సంవత్సరం ఇంటర్ పరీక్షలు ప్రారంభం

గుంటూరు(విద్య), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 81 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు జనరల్ విద్యార్థులు 28,812 మంది హాజరుకావాల్సి ఉండగా 28,432 మంది హాజరయ్యారు. పరీక్షకు 380 మంది గైర్హాజరయ్యారు. అదే విధంగా వృత్తి విద్యాకోర్సుల విద్యార్థులు 898 మందికిగాను 833 మంది హాజరుకాగా 65 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా కూడా మాల్ ప్రాక్టీస్, కాపీయింగ్ కేసులు నమోదు కాలేదని, పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు ఆర్ఐ జికె జుబేర్ తెలిపారు. ఇదిలా ఉంటే ఇంటర్ దూర విద్య పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 2,354 మంది విద్యార్థులు 11 కేంద్రాల్లో పరీక్షలకు హాజరయ్యారు.

న్యాయం చేస్తాం

- సాయిసాధన చిట్ బాధితులకు సీఎం హామీ

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట సాయిసాధన చిట్ ఫండ్ బాధితులు సోమవారం సీఎం చంద్రబాబును, మంత్రి లోకేశ్‌ను కలిసేందుకు ఉండవల్లిలోని సీఎం నివాసానికి వచ్చారు. అదే సమయంలో సచివాలయం నుంచి నివాసానికి వచ్చిన సీఎం చంద్రబాబు పెద్ద సంఖ్యలో ఉన్న చిట్‌ఫండ్ బాధితులను చూసి తన కాన్వాయ్‌ని ఆపారు. రోడ్డుపైనే ఆగిన సీఎం సుమారు 10 నిమిషాలపాటు బాధితులు గోడు విన్నారు. 'సాయి సాధన 25 సంవత్సరాలుగా నడుస్తున్న చిట్‌ఫండ్ కంపెనీ. మమ్మల్ని మోసం చేసింది. రూ.250 కోట్లకు శఠగోపం పెట్టింది. మాకు న్యాయం చేయండి' అంటూ మొరపెట్టుకున్నారు. బాధితుల గోడు విన్న సీఎం.. 'ప్రజల్ని మోసం చేసిన వాళ్లు కోర్టులో లొంగిపోయామంటే కుదరదు. బాధితులకు పూర్తి న్యాయం చేస్తాం. వారిని ఆదు కునేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం' అని హామీ ఇచ్చారు.

జీడీసీసీపై.. ఆర్బీఐ కొరడా

- రూ. 50 వేలు పెనాల్టీ విధింపు
- ఫైన్ పడితే రానున్న రెండేళ్లు బ్యాంకుకు కష్టకాలమే
- 2022-23 బ్యాలెన్స్ షీట్ ప్రచురించటంలో విఫలం

గుంటూరు సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకుకు (జీడీసీసీ) కోలుకోలేని దెబ్బ తగిలింది. బ్యాంకు విధి విధానాలపై ఆర్బీఐ(రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా)కన్నెర్ర చేసింది. రూ. 50 వేలు పెనా ల్టీ విధిస్తూ ఆదేశాలు జారీచేసింది. 2022-2023 ఆర్థిక సం వత్సరానికి సంబంధించిన ఖాతాలు, బ్యాలెన్స్ షీట్‌ను ప్రచు రించడంలో బ్యాంక్ విఫలమైనందున ఈ చర్యలకు ఉపక్రమిం చింది. 2022-23 సంవత్సరాల్లోనే జీడీసీసీ బ్యాంకు వేదికగా రు ణాల మంజూరులో అనేక అక్రమాలు జరిగాయి. ఈ నేపథ్యం లోనే బ్యాలెన్స్ షీట్ దాఖలు చేసేందుకు బ్యాంకు అధికారులు వెనకడుగు వేసినట్లు తెలుస్తోంది. ఖాతాల వివరాలు వెల్లడిస్తే నకిలీ భాగోతాలు వెలుగులోకి వస్తాయన్న భయంతోనే గోప్యత పాటించినట్లు అర్థం అవుతుంది. నకిలీ ఆధార్ కార్డులతో, ఈ-కేవైసీతో సంబంధం లేకుండా కోట్ల రూపాయలను వైసీపీ నేతలు కొల్లగొట్టారు. ప్రత్తిపాడుతో పాటు జిల్లాలోని 17 సహకార సంఘాల్లో అక్రమాలు జరిగాయి. మొత్తం రుణ మాఫియాలో 184 మంది రైతులు, 21 మంది జీడీసీసీ మేనేజర్‌లు, అసిస్టెంట్ మేనేజర్‌లు ఉన్నట్లు సహకార శాఖ తేల్చింది. క్షేత్ర స్థాయిలో కనీస పరిశీలన లేకుండానే మేనేజర్, సూపర్‌వైజర్, సీఈఓ అడ్మినిస్ట్రేటివ్ సర్క్యులర్‌కి వ్యతిరేకంగా రుణాలు మం జూరు చేయటంతో అక్రమాలకు తెరలేచింది. ఇదే విషయాన్ని నాబార్డు కూడా తప్పు పట్టింది. గత ఐదేళ్లుగా సాగిన రుణ మాఫియా భాగోతంలో అసలు దోషుల పై చర్యలు తీసుకునేందుకు బ్యాంకు సీఈఓ తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారు. ప్రత్తిపాడు బ్రాంచ్‌లో అక్రమాలకు పాల్పడిన 11 మంది నకిలీ రైతులను పోలీసులు అరెస్టు చేశారు. నకిలీ పాసు పుస్తకాలు, ఆధార్ కార్డులు, ఇతర డాక్యుమెంట్‌లు సృష్టించి రూ. 5 కోట్ల వరకు ఈ బ్రాంచ్ నుంచి కొల్లగొట్టినట్లు పోలీసులు తేల్చా రు. కొందరు తహసీల్దార్‌లు,వీఆర్వో లు నిందితులుగా ఉన్నారు. జీడీసీసీ అక్రమాలపై మొత్తం 18 కేసులు నమోదు అయినట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. జీడీసీసీ బ్యాంకు కు చెందిన 42 శాఖల్లో నూ అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. నల్లపాడు జీడీసీసీ శాఖలో కూడా రూ. 70 కోట్లకు పైగా అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు రాగా, వివాదం ముదురుతున్న తరుణంలో రుణాలు తీసుకున్న వ్యక్తులు కొంత మొత్తం తిరిగి చెల్లించారు.

పెనాల్టీ పడితే అంతే..

ఏ బ్యాంకు అయినా ఆర్బీఐ పెనాల్టీ విధించడం తీవ్రమైన చర్యగా భావిస్తారు. దానివల్ల రానున్న రెండేళ్ల పాటు పెనాల్టీ విధించబడిన బ్యాంకు కు సంబంధించిన అన్ని విషయాల పై ఆర్బీఐ కన్ను వుం టుంది. పెనాల్టీ వేసిన తర్వాత బ్యాంకు కు సంబంధించిన డిపాజిట్లు విత్ డ్రా పై ఆర్బీఐ నియంత్రణ ఉంటుందని చెబుతు న్నారు. ఇష్టానుసారంగా డిపాజిట్లు విత్ డ్రా చేయడానికి ఆర్బీఐ ఒప్పుకోక పోగా, పరిమితి కూడా పెడుతుంది. ఆర్బీఐకి సంబంధిం చిన ఆడిటర్ల చేత పెనాల్టీ విధించిన బ్యాంకు ను తనిఖీ చేయిస్తారని తెలుస్తున్నది. అంత మాత్రమే కాకుండా రెండేళ్ల పాటు అన్ని రకాల ఉత్తర ప్రత్యుత్తరాలపై కూడా ఆర్బీఐ కఠినంగా వ్యవహరిస్తుంది.



ఉర్దూ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు (విద్య), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉర్దూ గురుకుల పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.సాంబశివరావు సోమవారం తెలిపారు. పాఠశాల స్థాయిలో 5, 6, 7 ,8 తరగతిలో సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, డిగ్రీ మొదటి సంవత్సరాల్లో ప్రవేశానికి ఏప్రిల్ 25వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు ఏపీఆర్జేసీ సెట్ పరీక్ష ద్వారా అడ్మిషన్లు పొందాలని సూచించారు. కోస్తా ఆంధ్రలో ఉన్న ముస్లిం విద్యార్థులు ప్రవేశ పరీక్ష కోసం ఏపీ ఆర్ఎస్ సొసైటీ వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం 8712625073, 9652569140 నంబర్స్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

పౌర్ణమికి అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు

గుంటూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న పౌర్ణమి సందర్భంగా అరుణాచలంలో గిరి ప్రదక్షణకు భక్తుల కోసం ఆర్టీసీ స్పెషల్ హైటెక్ 2+2 పుష్ బ్యాక్ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలాం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ బస్టాండ్ నుంచి 12న రాత్రి 9.15 గంటలకు బయల్దేరి 13వ తేదీన శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్‌టెంపుల్ దర్శించుకొని అదే రోజు రాత్రి అక్కడే బస చేసి 14న పౌర్ణమి రోజున అరుణాచలంనకు చేరుకుంటుందన్నారు. అదే రోజున అరుణచలేశ్వరుని దర్శించుకొని సాయంత్రం బయల్దేరి 15వ తేదీన ఉదయం 6.30 గంటలకు గుంటూరు బస్టాండ్‌కు చేరుకుంటుందన్నారు. 96164 సర్వీసుకు ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఒక్కోచార్జి రూ.2,420 మాత్రమేనని పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం 7382897459, 7382896403 సంప్రదించాలని కోరారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 527.80 అడుగులు ఉంది. ఇది 163.88 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7033 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8807 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 31,850 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 49,770 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 39,109 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.



ఉద్యోగావకాశాలు

➾ గుంటూరు సిటీలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు విశ్రాంత ఉద్యోగులు 10th పాస్, 50 సం॥పై వయస్సు వారు కావలెను. సంప్ర॥ 70367 61665.
AJG-210390

➾ వంట మీద ఆసక్తి కలిగిన మగవారు కావలెను. వయస్సు : 18-21 లోపల Contact : Pany's Kitchen LVR Club ప్రక్క రోడ్‌లో గుంటూరు. సెల్ : 9848214148.
AJG-210388

➾ హ్యాపీ హెల్త్‌కేర్, గుంటూరు వారితోట 7వ లైను, పేషెంట్, బెడ్‌పేషెంట్ అటెండర్స్, వంట మనిషి, ఆయాలు మరియు అనుభవం గల మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను, సంప్ర॥ 9492672877.
AJG-210472

అమ్మకము

➾ గుంటూరు కార్పొరేషన్ పరిధిలో నూతనంగా నిర్మించిన ఫంక్షన్ హాల్, 7 గదులు, స్విమ్మింగ్ పూల్‌తో అమ్మకానికి కలదు. సంప్ర॥ 93976 03138.
AJG-210385

➾ SPM కాపీర్ పేపర్ షీటర్ లోటస్ ఇంజనీర్స్ మిషనరీ SBI వేలం ద్వారా అమ్మబడును. ఫోన్ : 96529 95559, 93475 44565
AAA-9933

రియల్ ఎస్టేట్

➾ శ్రీకృష్ణ బృందావనం! ఫార్మ్ లాండ్ గుంటూరు నుండి బేయపాలెం మీదుగా కొండవీడ 25 కి.మీ. పర్యటక ప్రాంతం, సమీపంలో @ సెంటు - లక్ష రూపాయలు, 14 సెంట్లు, 10 సెంట్లు బిట్స్ కలవు. పక్కా రిజిస్ట్రేషన్, సంప్ర॥ 93814 49563.
AJG-210383

FLAT FOR SALE

➾ గుంటూరు సిటీలోని ఇన్నర్ రింగ్ రోడ్డులో YSR బొమ్మ దగ్గర 3000 Sq.f. తో అన్ని వసతులతో అపార్ట్‌మెంట్‌లో డ్యూప్లెక్స్ ఫ్లాట్ అమ్మకానికి కలదు. సంప్ర॥ 9394113848.
AJG-210389

EDUCATION

➾ Discontinued or ఫెయిలైన విద్యార్థులకు వం॥లో పాస్ అయ్యే అవకాశం.10th / Inter / Degree / PG / Diploma/ B.Tech / LLB / Certificate Courses, UGC Regd. Universities, Sri Sai Education, Kadapa, Cell : 98855 11226.
AJC-224639

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు
ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు
99854 03281
సమయం :
ఉ॥ 10:00 గం॥ల నుండి
సా॥ 06:00 గం॥ల వరకు
(సోమవారం నుండి శనివారం వరకు)

పోయినవి

➾ I, ETE PARVATHI, W/o. Siva Brahmaiah, R/o. H.No.209, Apama Saibar Jone, block, Near Cityzens Hospital, Nalagandla, K.V.Ranga Reddy District, Telangana State. Our property site, property in Guntur, Guntur District registered a Gift Deed as Doct. No.13031/2023 in Nallapadu - Registrar's Office. That the Original Document was lost by while I am going to Zerox Center Pattabhipuram to Syamalanagar. I make search for that and I am unable to traced out it inspite of my best efforts.
AJG-210391

CHANGE OF NAME

➾ I DARREN J VIPPARTY S/o VIPPARTY JOY PRAKESH resident of Flat: No 403, Prime Hills Crest, Beside DGP office Vaddeswaram Tadepalle Guntur IN My Passport No X8365822 my name was wrongly mention VIPPARTY DARREN JOY may be corrected My name VIPPARTY DARREN J in My Passport documents accordingly as per my Aadhar, CBSE 10th Certificate.
AJG-210392

➾ I SIVA NAGA LAKSHMI S spouse of VS SATYANARAYANA S resident of 10-20-17 amaravati plots chenchupeta Tenali Guntur dist have changed my name from SIVA NAGA LAKSHMI S to SANKA SIVA NAGA LAKSHMI vide affidavit Dt 22.02.2025 at Tenali
AJH-1737

గోల్డ్ ఫైనాన్స్

బంగారం కొనబడును

➾ బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర : 88024 89999
AJB-209310

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

సదా మీ సేవలో



అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

గుంటూరు 1 టౌన్ - 97036 18725
గుంటూరు 2 టౌన్ - 99854 01056
తెనాలి - 99854 11202
నరసరావుపేట - 99854 11206
బాపట్ల - 99663 35084
పిడుగురాళ్ళ - 93909 05725
మంగళగిరి - 93986 73618
అమరావతి - 95027 86195
పొన్నూరు - 97042 99094
రేపల్లె - 99854 12254
చిలకలూరిపేట - 98852 71281
వినుకొండ - 99662 50266
మాచర్ల - 88861 19952
సత్తెనపల్లి - 91103 23914
ప్రత్తిపాడు - 63004 34285
సర్క్యులేషన్ మేనేజర్ : 99854 11214

ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు
ఇట్లు : బ్రాంచ్ మేనేజర్

'యూత్ పార్లమెంట్'లో భాగస్వామ్యం కావాలి

● ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): భారతదేశ అభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ వారి ఆదేశాల మేరకు జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ కార్యక్రమ పోస్టర్‌ను ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మేధాశక్తిని ఉపయోగించి ప్రపంచంలో కెల్లా మన దేశాన్ని ప్రథమ స్థానంలో ఉంచేలా కృషి చేయాలనీ, అందులో భాగంగానే యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని సూచించారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య డి.దివ్య తేజోమూర్తి మాట్లాడుతూ జిల్లా స్థాయి నోడల్ అధికారులుగా జాతీయ సేవా పథకం జిల్లా కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ జేవీ సుధీర్ కుమార్, నెహ్రూ యువ కేంద్రం జిల్లా యూత్ అధికారి కిరణ్మయి దేవిరెడ్డిలను ప్రభుత్వం నియమించినట్లు చెప్పారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నుంచి 18 నుంచి 25 ఏళ్ల వయస్సు కలిగిన వారు ఎవరైనా ఈ యూత్ పార్లమెంట్ పోటీలలో పాల్గొనవచ్చని, ముందుగా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మై భారత్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అనంతరం ఒక నిమిషం నిడివి కలిగిన "వాట్ డజ్ వికసిత్ భారత్ మీన్ టూ యూ" అనే అంశంపై వీడియో చేసి మార్చి 9వ తేదీలోపు మై భారత్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని తెలియజేశారు. తరువాత స్క్రీనింగ్ చేసి జిల్లా స్థాయిలో ఎంపిక జరుగుతుందనీ, ఈ గొప్ప అవకాశాన్ని యువత అందరూ తప్పనిసరిగా వినియోగించుకుని దేశాభివృద్ధిలో పాలుపంచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ఓఎస్డి ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవి కుమార్ ఈ కార్యక్రమం విశిష్టతను వివరించారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం


పోటీలు ప్రారంభిస్తున్న పాల్‌కుమార్, కోటేశ్వరమ్మ, చైర్మన్ శేషగిరిరావు

నరసరావుపేట టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర కళాశాలల మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం ప్రారంభం అయ్యాయి. పోటీలను ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పీపీఎస్ పాల్‌కుమార్, టైనీటాట్స్ స్కూల్ అధినేత పాతూరి కోటేశ్వరమ్మ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ ఫోన్లకి బానిసలు అవుతున్నారనీ, ఆటపాటలకు దూరంగా ఉంటున్నారని అన్నారు. మొబైల్‌కి దూరంగా ఉంటూ ఆటలు, చదువులో ముందుండాలని అన్నారు. మహిళలు చదువుతోపాటు అన్ని రంగాలలో ముందుండాలని సూచించారు. ఏఎన్‌యూ అంతర కళాశాల మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంఏఎం ఫార్మసీ కళాశాల ఆతిథ్యం ఇస్తుందని చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు తెలిపారు. కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య మాట్లాడుతూ పోటీల్లో ఎంపికైన విద్యార్థులు కరైకుడిలోని అల్లప్ప యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా మహిళల అంతర విశ్వవిద్యాలయాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. పోటీలలో ఆరేపల్లి ముప్పాళ్ళ ధనలక్ష్మి కాలేజి ఆఫ్ ఎడ్యుకేషన్, కేసానుపల్లిలోని ఎంఏఎం ఫార్మసీ కాలేజి, నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాల, ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్, తెనాలి జేఎంజే జట్లు పాల్గొంటున్నాయి. పోటీలకు సెలక్షన్ కమిటీ సభ్యులుగా డాక్టర్ సీహెచ్ వెంకటరావు, జె.ప్రేమ్‌కుమార్, ఈదర ఆదిబాబు, డాక్టర్ అరుణ సుజాత వ్యవహరిస్తున్నారు. నాకౌట్ మ్యాచ్‌లలో జరిగిన పోటీలలో నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాల, లీగ్ మ్యాచ్‌లో ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్స్ విజేతలుగా నిలిచాయి. కార్యక్రమంలో ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం ప్రసాదరావు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రామారావు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలు మంగళవారంతో ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

ధ్రువీకరణ పత్రం... నకిలీ సిత్రం

(5వ పేజీ తరువాయి)



తహసీల్దార్ స్టాంప్ పైన ఉండాల్సిన సంతకం అర్థం కాకుండా స్టాంప్‌లో కలసిపోయేలా గీతలు గీసిన సంతకం, స్టాంప్ కూడా పెద్ద సైజులో ఉండాల్సి ఉంటే, చిన్నది తయారు చేయించి వేసిన చిత్రం

మధ్యలో ఉన్న కొద్ది రోజుల్లో అధికారిక స్టాంపులతో దోచిపెట్టారా! అనేది అర్థంకాని విషయం. సాధారణంగా జగనన్న కాలనీల్లో భూములు ఇవ్వాలంటే పేదలయి ఉండాలి. కానీ ఇక్కడ కొన్ని సంస్థల పేరుపెట్టి కొందరు వ్యక్తులు భూములను నొక్కేశారు. సామాన్యుడికి పట్టణ ప్రాంతాల్లో కేవలం ఒక్క సెంటు భూమి మాత్రమే అప్పటి జగన్ సర్కారు ఇస్తే, వీరు రెండు నుంచి ఐదు సెంట్ల వరకు తీసుకున్నారు. అయితే పేదలకు కేటాయించిన ప్లాట్లలో అయితే ఆధార్ వంటి అన్ని పత్రాలు అప్‌లోడ్ చెయ్యాల్సిన పరిస్థితి ఉండటం, సంస్థలకు వీటిలో ఇచ్చే అవకాశం లేకపోవటంతో ఒక్కో కాలనీలో ఇళ్ల కేటాయించిన లబ్ధిదారుల భవిష్యత్ అవసరాలు, పార్క్, ఆట స్థలాల వంటివాటి కోసం కేటాయించిన కమ్యూనల్ స్థలాలను టార్గెట్‌గా చేసుకుని ఈ నకిలీ పత్రాలతో ఆక్రమించేశారు.

ధ్రువీకరణ పత్రాలతో పన్నుల చెల్లింపు

ఒక భూమిపై హక్కు పొందాలంటే ప్రభుత్వం అధికారికంగా అందించిన పట్టా ఉండాలి. లేక నివేశన స్థల ధ్రువపత్రం కానీ, పట్టా కానీ ఉండాలి. కానీ ఇక్కడ నకిలీ ధ్రువీకరణ పత్రాలు పుట్టుకొచ్చాయి. పెదరావూరు లేఔట్‌లో కమ్యూనల్ స్థలాన్ని ఆక్రమించి ఉండటం గుర్తించిన రెవెన్యూ అధికారులు వారిదగ్గరున్న పట్టాను చూపాలని కోరటం, రెండు ప్రయివేటు సంఘాల పేరుతో స్థలాలు పొందినట్లు ధ్రువపత్రాలు చూపటంతో వాటిని పరిశీలిస్తే అవి నకిలీవని తేలింది. అయితే ఇదే తరహాలో తాజాగా ఒక ప్రైవేటు స్థలానికి, మండల పరిధిలోని మరికొన్ని ప్రభుత్వ స్థలాలకు ఇదేతరహా పత్రాలను చూపి పన్నులు చెల్లించనట్టు సమాచారం అందటంతో అధికారులు వీటిపై దృష్టిపెట్టారు. మండలంలో ఎక్కడెక్కడ ఎంత మేర ప్రభుత్వ భూములను ఆక్రమించారో తెలుసుకునే పనిలో పడ్డారు. ఇంతటి వ్యవహారంలో రెవెన్యూ సిబ్బంది సహకారం లేకుండా జరిగే అవకాశం తక్కువ. అయితే దీనికి సహకరించింది ఎవరు? ఇంకా ఎంతమందికి! ఎన్ని రూ. కోట్ల విలువైన స్థలాలను అప్పగించేశారనేది తేలాల్సిఉంది. దీనిపై వివరణ అడిగేందుకు ప్రయత్నిస్తే రెవెన్యూ అధికారులు అందుబాటులో లేరు. అధికారికంగా చెప్పకున్నా, ఈ నకిలీల వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేసే ఆలోచనలో ఉన్నారని మాత్రం సమాచారం.

పట్టభద్రుల పోరులో.. కూటమి దూకుడు

(5వ పేజీ తరువాయి)

రౌండ్‌లోనూ ఆలపాటి హవా కొనసాగింది. ఈ రౌండ్‌లో ఆలపాటికి 16,722 ఓట్లు రాగా, లక్ష్మణరావుకు 7404 ఓట్లు వచ్చాయి. 2978 ఓట్లు చెల్లుబాటు కాలేదు. నాల్గో రౌండ్‌లో ఆలపాటికి 16236 ఓట్లు, లక్ష్మణరావుకు 7828 ఓట్లు రాగా 3035 ఓట్లు చెల్లుబాటు కాలేదు. ఐదో రౌండ్‌లో ఆలపాటికి 16916, లక్ష్మణరావుకు 7535 ఓట్లు రాగా 2800 ఓట్లు చెల్లుబాటు కాకుండా పోయాయి. దీంతో ఐదో రౌండ్ ముగిసేసరికి ఆలపాటి మెజార్టీ 47,872కి చేరింది.

తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాదు తన రాజకీయ అనుభవాన్ని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రంగరించారు. ఎవరూ ఊహించనంతగా తొలి ప్రాధాన్య ఓట్లు తనకు వేసేలా పట్టభద్రుల్లో చైతన్యం నింపారు. ఏ బ్యాలెట్ బాక్సు తెరిచి ఓట్ల లెక్కింపు ప్రారంభించినా కౌంటింగ్ హాల్ అంతా ఆలపాటి పేరే వినిపించింది. తొలి రౌండ్ ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యేసరికే దాదాపుగా 10 వేల మెజార్టీ లభించడంతో అక్కడే రాజా విజయం ఏ స్థాయిలో ఉండబోతుందో చెప్పకనే చెప్పినట్లు అయింది. అది మొదలుకొని ప్రతీ రౌండ్‌లోనూ ఆయన హవా కొనసాగింది. నాల్గో రౌండ్ కౌంటింగ్ ముగిసేసరికే ఆలపాటికి సమీప ప్రత్యర్థి అయిన సిట్టింగ్ పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కౌంటింగ్ హాల్‌ని విడిచి వెళ్లిపోయారు.

పక్కా ప్రణాళికతో ఓట్ల లెక్కింపు

ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలను రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొన్నారు. ఎన్నికల నిర్వహణలో పక్కా ప్రణాళికతో ముందుకెళ్లారు. ఎలక్షన్ షెడ్యూల్ వెలువడిన రోజు నుంచి కోడ్‌ని పకడ్బందీగా అమలు చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులతో సమావేశాలు నిర్వహించి సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. మరోవైపు పోలింగ్, ఓట్ల లెక్కింపునకు సిబ్బందిని నియమించి వారికి పూర్తిస్థాయిలో శిక్షణ ఇప్పించారు. ఎక్కడా ఎలాంటి అస్పష్టతకు తావు లేకుండా ఎన్నికలనఉ నిర్వహించారు. గత ఎన్నికల్లో కంటే ఈ దఫా లక్ష ఓట్లు అధికంగా పోలింగ్ అయ్యాయి. అయినప్పటికీ ఫలితం ముందుగానే వెలువడేలా చేశారు. కౌంటింగ్ హాల్ విశాలంగా ఉండటంతో నాలుగు వరసల్లో ఏడు టేబుళ్ల చొప్పున 28 కౌంటింగ్ టేబుల్స్ ఏర్పాటు చేయించారు. ఇది ఓట్ల లెక్కింపుని సులభతరం చేసింది.

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఎన్జీవో కాలనీ 5వ లైన్‌లో జొన్నలగడ్డ శ్యాంప్రసాద్ ముఖర్జీ (54) అనే వ్యక్తి జామ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుడు శ్యాంప్రసాద్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే మద్యానికి బానిసై ఏ పని చేయకుండా తిరుగుతుండడంతో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చి ఐదేళ్లుగా వేర్వేరుగా ఉంటున్నారు. శ్యాం ప్రసాద్‌కు ఇద్దరు సోదరులు ఉన్నారు. అన్న విదేశాల్లో ఉండగా తమ్ముడు వసంతరాయపురంలో ఉంటాడు. తన తండ్రికి చెందిన పాడుపడిన ఇంటిలో శ్యాంప్రసాద్ ఒక్కరే ఒంటరిగా ఉంటున్నాడు. భార్య, పిల్లలు దూరం కావడం, ఏ పని చేయకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. అన్నదమ్ములకు జాయింట్‌గా ఉన్న ఇంటిని విక్రయించాలంటే సోదరుడు విదేశాల్లో ఉండడంతో సాధ్యం కాలేదు. మనస్తాపానికి గురైన శ్యాంప్రసాద్ జామచెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు

విశ్రాంత పోలీస్ అధికారి పృథ్వీనారాయణ హఠాన్మరణం


పృథ్వీ నారాయణ (ఫైల్)

గుంటూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఏఎస్పీ బి.పృథ్వీనారాయణ (77) హఠాన్మరణం చెందారు. అమెరికాలో గుండెపోటుతో సోమవారం మధ్యాహ్నం కన్నుమూశారు. పోలీస్ శాఖలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న పృథ్వీనారాయణ అత్యంత ధైర్య సాహసాలతో విధులు నిర్వహిస్తూ ముందుకు సాగారు. ఈ క్రమంలో ఆయన తీసుకున్న పలు నిర్ణయాలు వివాదాస్పదమైనప్పటికీ వెనక్కు తగ్గలేదు. తాను పనిచేసిన ప్రతి చోట రౌడీ షీటర్లు, దొంగలు, ఫ్యాక్షనిస్టులు, ఈవ్‌టీజర్లపై కఠిన వైఖరి అవలంబించి శాంతి భద్రతలు కాపాడారు. విజయవాడకు చెందిన పృథ్వీనారాయణ 1974లో ఎస్సైగా పోలీస్ శాఖలో చేరారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఆయన ఎస్సైగా, సీఐగా, డీఎస్పీగా సుదీర్ఘకాలం సేవలందించారు. గుంటూరు, నరసరావుపేట, తెనాలి తదితర సబ్ డివిజన్ల పరిధిలో ఆయన ఎస్ఐగా, సీఐగా, డీఎస్పీగా పని చేశారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇద్దరికి వివాహాలయ్యాయి. వారు ప్రస్తుతం అమెరికాలో స్థిరపడ్డారు. ఐదు నెలల క్రితం పృథ్వీనారాయణ, లీల దంపతులు అమెరికాలో పిల్లల వద్దకు వెళ్లారు. అక్కడ వారి వద్ద ఉండగా సోమవారం మధ్యాహ్నం ఆయనకు గుండెపోటు రావడంతో కన్నుమూశారు.

పలువురి సంతాపం

విశ్రాంత ఏఎస్పీ పృథ్వీనారాయణ ఆకస్మిక మరణం పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎం మాలకొండయ్య, కాళహస్తి సత్యనారాయణ, జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావు, న్యాయవాది బండి రామ్మూర్తి నాయుడు, విశ్రాంత డీఎస్పీ కేవీ నారాయణ, బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ సంతాపం వ్యక్తం చేశారు.

కొత్త థెరపీల అభివృద్ధికి దోహదం



మాట్లాడుతున్న ఆచార్య అప్పారావు

గుంటూరు (విద్య), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): క్రిస్పర్, క్యాస్9 సాంకేతికత ద్వారా జీనోమ్‌లో నిర్దిష్ట మార్పులు, జన్యుపరమైన రుగ్మతలను సరిదిద్దడం, వ్యవసాయంలో అధిక దిగుబడులు పొందడం, కొత్త థెరపీల అభివృద్ధికి విస్తృతంగా ఉపయోగపడుతుందని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ మాజీ వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ పొదిలి అప్పారావు అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 'సైన్స్ అకాడమీస్ లెక్చర్ వర్క్‌షాప్ ఆన్ రీసెంట్ ట్రెండ్స్ ఇన్ మోలిక్యులర్ బయోలజీ అండ్ బయోటెక్నాలజీ' అనే అంశంపై సోమవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. ఆచార్య అప్పారావు మాట్లాడుతూ ప్లాంట్ మైక్రోబియోమ్ అనేది ఒక మొక్క చుట్టూ, దాని లోపల నివసించే సూక్ష్మజీవుల (బ్యాక్టీరియా, శిలీంధ్రాలు, వైరస్‌లు, ఇతర మైక్రో ఆర్గానిజం) సమూహమని, ఈ సూక్ష్మజీవులు మొక్కల పెరుగుదల, వ్యాధి నిరోధకత, భూసార వృద్ధికి ఎంతో సహాయపడతాయని వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితిలో ప్లాంట్ మైక్రోబియోమ్‌పై పరిశోధనలు విస్తృతంగా జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్లాంట్ సైన్సెస్ హెడ్ ప్రొఫెసర్ రాజగోపాల్ సుబ్రమణ్యం, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రొఫెసర్ పి.కొండయ్య, ప్రొఫెసర్, వర్క్‌షాప్ కన్వీనర్ ఆగేపాటి ఎస్.రాఘవేంద్రరావు, విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నింటికీ మూలం రసాయన శాస్త్రం

పెదకాకాని, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన శాస్త్రాలన్నింటికీ మూల శాస్త్రం రసాయన శాస్త్రం అని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు పేర్కొన్నారు. వర్సిటీలోని రసాయన శాస్త్ర విభాగంలో రెండు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సును సోమవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. గంగాధరరావు మాట్లాడుతూ వర్తమాన కాలంలో మానవ వైద్యం నిమిత్తం ఉపయోగిస్తున్న అనేక రకాల మందులు, ఎన్నో రకాల టీకాలు, ఔషధాల్లో రసాయన శాస్త్రమే కీలక పాత్ర వహిస్తుందని తెలిపారు. వ్యవసాయ రంగంలో పురుగుమందులు, ఎరువుల తయారీ రసాయన శాస్త్రాన్ని అనుసరించే జరుగుతాయని తెలియజేశారు. టాంజానియాలోని దోడామ యూనివర్సిటీకి చెందిన ఆచార్య ఎస్‌బీ నంబూరి మాట్లాడుతూ రసాయన శాస్త్రం మానవ జీవన విధానంలో ఎలా సమ్మిళితం అయిందో వివరించారు. ఆచార్య ఎం.సుబ్బారావు సంచాలకులుగా నిర్వహించిన ఈ సదస్సుకు ఆచార్య దిట్ట కవి రామచంద్రన్ అధ్యక్షత వహించారు. సదస్సులో ఏఎన్‌యూ తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, వర్సిటీ ఓఎస్‌డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, సైన్స్ కళాశాల ప్రాచార్యులు ఆచార్య వీరయ్య, దూరవిద్య కేంద్ర సంచాలకులు ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, ఆచార్య ఎం.త్రిమూర్తిరావు, ఆచార్య ఆర్ శ్రీనివాసరావు, సత్యనారాయణ, ఆచార్య పి.పద్మావతి, రసాయన శాస్త్ర విభాగ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

గొట్టిపాడు కాశీ విశ్వేశ్వరాలయంలో చోరీ

● రూ.9 లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాల అపహరణ


కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో తొలగించిన తలుపు నుంచి వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

ప్రత్తిపాడు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొట్టిపాడు కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు 9 లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలను అపహరించుకుపోయారు. దేవాలయానికి పటిష్టంగా రెండు వైపులా ఇనుప తలుపులతో పాటు ప్రధాన ద్వారాలు ఉన్నాయి. ఆ తరువాత గర్భగుడికి కూడా ఇనుప గేటుతో తాళం వేసి ఉంటుంది. ఈ రెండు గేట్లను దాటుకుని దుండగులు గర్భగుడిలోకి ప్రవేశించి అమ్మవారి మూడు కేజీల వెండి నాగాభరణంతో పాటు అమ్మవారి బంగారు తాళిబొట్టు, గొలుసు, బొట్టు, బులాకీలను అపహరించుకు పోయారు. వీటి విలువ సుమారు రూ. 9 లక్షలు ఉంటుందని ఆలయ అర్చకుడు బాబు తెలిపారు. ఆలయ అర్చకునితోపాటు 35 మంది భక్తులు శివ మాల ధరించి ఆదివారం రాత్రి శ్రీశైలం వెళ్లారు. ఆదివారం రాత్రి పూజారి భార్య తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. ఒక్కరే ఈ చోరీ చేసినట్లు ఆలయంలోని సీసీ పుటేజిలో కన్పిస్తుంది. అయితే వచ్చిన దొంగ చేతికి గ్లౌజులు ధరించి ఉన్నాడు. ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్ర సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించారు.

గంజాయి విక్రేత అరెస్టు



నిందితుని వివరాలు వెల్లడిస్తున్న సీఐ కల్యాణ్‌రాజు

తాడేపల్లి టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని సోమవారం తాడేపల్లి పోలీసులు అరెస్టు చేశారు. సీఐ కల్యాణ్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం పట్టణ పరిధిలోని సీతానగరం పరిసర ప్రాంతాల్లో గంజాయి అమ్ముతున్నారన్న సమాచారంతో నిఘా పెట్టారు. ఇందులో భాగంగా రైల్వే వంతెన వద్ద ముగ్గురు వ్యక్తులు గంజాయి అమ్ముతుండగా పట్టుకునే క్రమంలో ఇద్దరు పారిపోగా విజయవాడ విద్యాధరపురంకు చెందిన గుమ్మడి సాయికుమార్‌ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి ఒక కేజీ 150 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. కాగా విజయవాడకు చెందిన కోటి, మహేష్ అనే వారిని పట్టుకుంటామని తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	104, 112, 123
చికెన్ విత్ స్కిన్	200.00
చికెన్ స్కిన్ లెస్	210.00

1,55,229 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,82,384 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,55,229 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 71,945 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. కాగా సోమవారం 341 వెరైటీ మిర్చి ఈ సీజన్‌లో తొలిసారిగా క్వింటాల్ రూ. 15 వేల ధరకు అమ్ముడైంది.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			షార్క్-1	11500	13000
334	9000	13900	బ్యాడిగి 355	10500	13500
నంబరు. 5	10500	14500	సింజెంటా		
273	10000	13000	బ్యాడిగి 5531	10000	12500
341	10500	15000	ఎన్ఎస్ 250		
4884	9000	13000	బుల్లెట్	--	--
సూపర్ 10	--	--	దేవనూరు డీలక్స్	12500	13500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఆర్మూరు	10000	11500
తేజ	10500	14000	తాలుకాయలు	5000	7500

గుంటూరు సిటీ వార్తలు

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి: 99854 11213, 99854 11225 | 99854 01877, 99854 04047, 99854 01614

అనధికార, అక్రమ నిర్మాణాలపై కఠినచర్యలు

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో అనుమతులు లేని, అనుమతులు పొంది నిబంధనలకు విరుద్ధంగా చేపట్టే నిర్మాణాలపై కఠినచర్యలు తప్పవని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. భవన నిర్మాణదారులు, బిల్డర్లు విధిగా నిబంధనలు పాటించాలన్నారు. భవన నిర్మాణానికి అనుమతులిచ్చే సమయంలోనే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ పొందిన తర్వాతనే భవనంలో నివాసానికి అనుమతిస్తామని, యజమాని నుండి అంగీకారపత్రం తీసుకుంటామన్నారు. భవన నిర్మాణదారులు నిర్మాణాలు పూర్తయ్యేవరకు ప్లాన్‌ని ముందువైపు ఏర్పాటుచేసి ఉంచాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారులపై కూడా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేని భవనాలకు తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ కనెక్షన్ లు మంజూరు చేయబోమన్నారు. అక్రమనిర్మాణాల్లో వ్యాపారాల నిర్వహణకు ట్రేడ్, వ్యాపారాలకు సంబంధించిన అన్ని రకాల అనుమతులు నిలిపివేస్తామన్నారు. ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసిన 90 రోజుల్లోగా అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన, తుది అనుమతులను జారీ చేస్తారని తెలిపారు.

గంజాయి మహమ్మారిని కూకటి వేళ్ళతో పెకలించాలి

● శాసనసభలో ఎమ్మెల్యే గల్లా మాధవి


శాసన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గల్లా మాధవి

గుంటూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో, ముఖ్యంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో గంజాయి మహమ్మారిని కూకటి వేళ్ళతో పెకలించివేయాలని ఎమ్మెల్యే గల్లా మాధవి కోరారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆమె మాదకద్రవ్యాల అంశాన్ని లేవనెత్తారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో చిన్నచిన్న దుకాణాల్లో మైనర్లకు కూడా గంజాయిని విక్రయిస్తున్నారని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటు, పోలీస్ పెట్రోలింగ్, చెక్‌పోస్టులను ఏర్పాటుచేయాలని హోం మంత్రిని కోరారు. హోంమంత్రి అనిత స్పందిస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు.

● ఒత్తిడి లేని విద్యను విద్యార్థులకు అందించడానికి అందరం కృషి చేయాలని ఎమ్మెల్యే మాధవి కోరారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల 'జీరో అవర్'లో విద్యావ్యవస్థలో మార్పులపై ఆమె కొన్ని సూచనలు సభ దృష్టికి తెచ్చారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు నిర్వహిస్తూ ఉంటే, వారు మానసిక ఉల్లాసాన్ని పొందుతారు. పాఠశాలలకు క్రీడామైదానాన్ని కూడా ఏర్పాటుచేసిన తరువాతే అనుమతులు ఇవ్వాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కోరారు.

నూతన భవన సముదాయానికి రూ.6లక్షల విరాళం


సామినేని కోటేశ్వరరావుకు చెక్కును అందజేస్తున్న కొల్లా రాధికారాణి, కొడాలి త్రివేణి తదితరులు

గుంటూరు(తూర్పు), మార్చి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని కమ్మ జన సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న వసతి భవన సముదాయంలో ఒక గదికి అయ్యే ఖర్చు రూ.6లక్షలను ప్రవాసాంధ్రులు కొల్లా రాధికారాణి, శివప్రసాదు, కొడాలి త్రివేణి, రవి చంద్రలు ప్రకటించారు. సోమవారం బృందావన్‌గార్డెన్స్‌లో కమ్మజనసేవ సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావుకు వారు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ కొలసాని సాంబశివరావు జ్ఞాపకార్థం ఈ విరాళాన్ని అందజేస్తున్నట్టు తెలిపారు. సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ వసతిగృహానికి దాతలు ఆర్థికసాయం అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు వడ్లమూడి నాగేంద్రం, పాలకవర్గ సభ్యుడు పెద్ది సాంబశివరావు, గోరంట్ల పున్నయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభీష్టం మేరకే నిర్మాణాలు

● గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్


మూడు వంతెనల వద్ద పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ప్రజాభీష్టం మేరకు మూడు వంతెనల నిర్మాణాన్ని చేపడుతున్నామని, రాబోయే తరాలకు ఇది మరింత సౌకర్యంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అన్నారు. మూడు వంతెనల వద్ద నిర్మాణ పనులను సోమవారం ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యేని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. వెంట్ 50 అడుగుల మేర ఉందని, అప్రోచ్ రోడ్డు కూడా 50 అడుగులు ఉండేలా మార్పుచేయాలని అధికారులకు సూచించారు. ఈ నిర్మాణాలను ప్రజలకు అనుకూలంగా మార్చి త్వరలోనే అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు సూచించారు.

అప్పుల భారాన్ని పెంచే బడ్జెట్

● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ

గుంటూరు కార్పొరేషన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అప్పుల భారాన్ని ప్రజలపై మరింత మోపేలా ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు పేర్కొన్నారు. గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో రాష్ట్ర బడ్జెట్ పై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి అధ్యక్షత వహించారు. ముప్పాళ్ళ ప్రసంగిస్తూ డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రానికి చేరుతున్న ప్రయోజనం శూన్యమని, కేంద్ర ప్రభుత్వం విభజన చట్టం హామీలను అమలు చేయకుండా రాజధాని నిర్మాణానికి గ్రాంటులు ఇవ్వకుండా అప్పులు ఇప్పిస్తూ రుణభారాన్ని పెంచుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత షేక్ మస్తాన్‌వలి ప్రసంగిస్తూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంలో ప్రకటించిన నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి పేరుతో ప్రతి మహిళకు ప్రతినెలా ఇస్తానన్న రూ.1500, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, డ్వాక్రా మహిళలను వడ్డీ రహిత రుణాలకు నేటి బడ్జెట్‌లో కేటాయింపులు జరగలేదన్నారు. కార్యక్రమంలో నేస్తం సహ వ్యవస్థాపకుడు టీ ధనుంజయ రెడ్డి, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓరుగంటి నారాయణరెడ్డి, రాజ్యాంగ చర్చావేదిక కన్వీనర్ అవధానుల హరి, ప్రోగ్రెసివ్ ఫోరం అధ్యక్షుడు మురళీకృష్ణ తదితరులు ప్రసంగించారు.



ప్రసంగిస్తున్న ముప్పాళ్ళ నాగేశ్వరరావు, వేదికపై లక్ష్మణ్‌రెడ్డి, మస్తాన్‌వలి తదితరులు

ప్రజల విశ్వాసానికి అనుగుణంగా పని చేస్తా

● ఆలపాటి రాజేంద్రప్రసాదు


కౌంటింగ్ హాల్ వెలుపల విక్టరీ సింబల్ చూపిస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాదు

గుంటూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల విశ్వాసానికి అనుగుణంగా పని చేస్తా ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదు అన్నారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఐదవ రౌండ్ ఓట్ల లెక్కింపు ముగిసేసరికే ఆయన 47,872 వేల పైచిలుకు తొలి ప్రాధాన్య ఓట్లు సాధించడంతో ఆయన తన ప్రత్యర్థి కేఎస్ లక్ష్మణరావు కంటే ముందంజలో వున్నారు. గుంటూరు ఏసీ కళాశాలలోని కౌంటింగ్ హాల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రగతి, అభివృద్ధికి ఓటు వేయమని తాను విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. అనుకున్నది సాధించే ప్రభుత్వం కూటమి స్వంతం. మాపై ప్రజలు ఎంతో విశ్వాసాన్ని ఉంచి రికార్డు స్థాయిలో మెజార్టీని కట్టబెట్టారు. ఈ నమ్మకాన్ని నిలబెట్టుకొంటూ పట్టభద్రుల కోసం అహర్నిశలు కృషి చేస్తాను. నాకు భారీ మెజార్టీ రావడానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. తనకు ఉండవల్లిలో సీఎం చంద్రబాబు, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఓటు వేయడాన్ని గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు.

ట్రాఫిక్ నిబంధనల అమలుపై డ్రోన్ నిఘా


డ్రోన్ కెమెరాతో పరిశీలిస్తున్న దృశ్యం


డ్రోన్ కెమెరాతో ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తున్న ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్

గుంటూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఈస్ట్ ట్రాఫిక్ స్టేషన్ పరిధిలోని లాలాపేట ఎంటీబీ సెంటర్, హిమని సెంటర్, పల్నాడు బస్టాండ్ సెంటర్, ఎత్తు రోడ్డు, పూలకొట్ల బజారు, నల్ల చెరువు ప్రధాన రహదారి, దర్గా సెంటర్ మొదలగు ప్రాంతాల్లో సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో డ్రోన్ గస్తీ నిర్వహించారు. ఆయా ప్రదేశాల్లో వాహనాల కదలికలు, పార్కింగ్ సరళిని పరిశీలించారు. నగరంలో ఇకనుండి నిరంతరం డ్రోన్ కెమెరాలతో గస్తీ నిర్వహించడం జరుగుతుందని, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వేగంగా వెళ్లే వాహనం నెంబర్ ప్లేట్ ని కూడా కనిపెట్టగలిగే సామర్థ్యంతో ఉన్న డ్రోన్ కెమెరాలను ఉపయోగిస్తూ ఈ డ్రోన్ గస్తీ నిర్వహిస్తున్నామని ట్రాఫిక్ సీఐ తెలిపారు. అతివేగం, ప్రమాదకరంగా వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్, రేసింగ్ వంటి చర్యలను కట్టడి చేసే దిశగా ఈ డ్రోన్ గస్తీ నిర్వహిస్తున్నామన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే డ్రోన్ కెమెరాలోని దృశ్యాల ఆధారంగా వారిపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు తమ వాహనాలను వారికి కేటాయించిన నిర్ణీత స్థలంలో కాకుండా ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై నిలుపుతూ ఇతర వాహనదారులకు, సాధారణ ప్రజానీకానికి ఇబ్బందులు కలిగే విధంగా చేస్తున్నట్లు గమనించామన్నారు. వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. తమకు కేటాయించిన స్థలంలో మాత్రమే పార్కింగ్ చేసుకోవాలన్నారు. ఆయా ప్రదేశాల్లోని వివిధ వ్యాపార సముదాయాల వారు, షాపుల వారు వాహనాలను తమ షాపుల ముందు రోడ్లపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేవిధంగా పార్కింగ్ చేయిస్తున్నట్లు పరిశీలించామన్నారు. వారు తగిన పార్కింగ్ స్థలాన్ని అధికారుల వద్ద నుంచి కేటాయించుకోవాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు హెల్మెట్ ధరించడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలను పాటించడం అనేది బాధ్యతగా భావించాలని లేకుంటే నూతన మోటార్ వాహనాల చట్ట ప్రకారం భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

నగరపాలక సంస్థ ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

● కలెక్టరేట్ ఎదుట నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులు


గుంటూరు (తూర్పు), మార్చి 3(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా నాయకులు మేడా హనుమంతరావు, బందెల రవికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు ఆలోచన విరమించుకోవాలన్నారు. ఆప్కాస్‌లో ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు అందుతున్నాయని, ఈ వ్యవస్థను రద్దు చేస్తే సదుపాయాలు రావన్నారు. ఆప్కాస్ మరింతగా బలోపేతం చేసి, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో కోట మాల్యాద్రి, దుర్గారావు, శ్రీధర్, రమేష్, మంగ, బాలాజీ, వెంకటేశ్వర్లు, మాధవి, భూలక్ష్మి, బుజ్జి, సువార్తమ్మ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నృసింహుని బ్రహ్మోత్సవాలు

మంగళగిరి సిటీ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీ లక్ష్మీనృసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 5నుంచి 16వ తేదీ వరకు జరుగనున్నాయి. దిగువ సన్నిధిలోని ఆలయంలో బుధవారం ఉదయం పెండ్లి కుమారుని ఉత్సవంతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడతారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఈ నెల 6వ తేదీ రాత్రి నిర్వహిస్తారు. మరుసటి రోజు నుంచి స్వామివారి వాహనసేవలు ఆరంభమవుతాయి. 7న హనుమంత వాహనం, 8న రాజాధిరాజ వాహనం, 9న ఉదయం ముత్యాల పల్లకీ సేవ, రాత్రి యాళి వాహనం, 10న ఉదయం చిన్న శేష వాహనం, రాత్రి సింహ వాహనం, 11న ఉదయం హంస వాహనం, రాత్రి గజ వాహనం, 12న ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి పొన్న వాహన సేవ, 13న ఉదయం అశ్వవాహనంపై గ్రామోత్సవం జరుగుతాయి. 13వ తేదీన అర్ధరాత్రి స్వామివార్ల కల్యాణమహోత్సవం జరుగుతుంది. 14న ఉదయం శ్రీదేవీ, భూదేవీ సమేతుడైన శ్రీలక్ష్మీనృసింహస్వామి వార్లకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. అదేరోజు మధ్యాహ్నం శ్రీవారి రథోత్సవం జరుగుతుంది. 15వ తేదీన ఉదయం 8 గంటలకు చక్రవారి చూర్ణోత్సవం, వసంతోత్సవం, రాత్రి ధ్వజ అవరోహణం, కేళిగుర్రం, దొంగలదోపిడీ తదితర కార్యక్రమాలు జరుగుతాయి. 16వ తేదీన జరిగే శ్రీ పుష్ప యాగోత్సవంతో బ్రహ్మోత్సవాలకు ముగింపు పలుకుతారు. ఈ నెల 17 నుంచి 29వ తేదీ వరకు స్వామివారి ఆస్థాన అలంకారోత్సవాలు నిర్వహిస్తారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతిరోజు ఆలయం వద్ద సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఏర్పాటుచేస్తారు.

ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద బ్యాంకర్ల ధర్నా

● 24, 25న బ్యాంకుల సమ్మెకు పిలుపు


మినిస్ట్రీ ఫైనాన్స్ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న బ్యాంకు ఉద్యోగసంఘాల నాయకులు

గుంటూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): దేశంలో 9 బ్యాంకు ఉద్యోగ సంఘాల యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) తరపున ఈనెల 24, 25వ తేదీల్లో బ్యాంకుల సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సోమవారం యూనియన్‌లతో పాటు గుంటూరు జిల్లాకు చెందిన ఉద్యోగులు ధర్నాలో భాగంగా పెద్దఎత్తున హాజరై నిరసన తెలిపారు. డిమాండ్లలో ముఖ్యంగా బ్యాంకులోని అన్ని విభాగాలలో తగిన రిక్రూట్‌మెంట్ చేయాలని, వారానికి 5 రోజుల పనిదినాలు ఉన్నాయని, ఈ క్రమంలోనే ప్రభుత్వరంగ బ్యాంకుల్లో వర్క్‌మెన్, ఆఫీసర్ డైరెక్టర్ల పోస్టుల భర్తీకి కూడా యూఎఫ్‌బీయూ డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ధర్నాలో నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయీస్ (ఎన్‌సీబీఈ) ప్రధానకార్యదర్శి ఎల్ చంద్రశేఖర్, ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) ప్రధానకార్యదర్శి సీహెచ్ వెంకటాచలం, ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ (ఏఐబీఓసీ) ప్రధానకార్యదర్శి రూపమ్‌రాయ్, మిగిలిన బ్యాంక్ ఉద్యోగుల సంఘాల ప్రధానకార్యదర్శులు, ఇతర నాయకులు పెద్దఎత్తున తమ నిరసనను తెలిపారు. అనంతరం 9 బ్యాంక్ ఉద్యోగ సంఘాల ప్రధానకార్యదర్శులు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని సెక్రటరీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియాకు అందజేసినట్లు జిల్లా నాయకులు తెలిపారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి

● ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాదు


రైతులతో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘ నాయకులు

గుంటూరు (తూర్పు), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మిర్చికి గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాదు అన్నారు. సోమవారం యార్డులో రైతు సంఘం నాయకులు పర్యటించి రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. క్వింటాకు రూ.11,781 మద్దతు ధర అని ప్రకటించడం సరికాదని, ఈ ధరతో ఎకరాకు రూ 2లక్షల నష్టం వస్తుందని రైతులు వాపోయారు. క్వింటాకు కనీసం రూ 20వేలు ప్రకటించాలని కోరారు. మచ్చు, కమీషన్, గోతాల పేరుతో క్వింటాకు రూ.వెయ్యి దోపిడీ చేస్తున్నారన్నారు. కేవీవీ ప్రసాదు మాట్లాడుతూ మిర్చి బోర్డును గుంటూరులో ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. కౌలురైతుల రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి జమలయ్య మాట్లాడుతూ వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధరలు తగ్గిస్తున్నారని ఆరోపించారు. మిర్చికి గిట్టుబాటు ధర కల్పించకపోతే ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఉలవపూడి రాములు, వి.హనుమారెడి, కె వీరారెడ్డి, పి.శివాజీ, కొల్లి రంగారెడ్డి, బాణాల రామయ్య, కంజుల విఠల్‌రెడ్డి, వీవీ జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి నగరోత్సవం

గుంటూరు(తూర్పు), మార్చి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టబంధన మహాసంప్రోక్షణ సమేత మహాకుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణ జరిగాయి. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన గజ వాహనంపై ఉభయదేవి సమేతుడైన స్వామి ఉత్సవమూర్తులకు నగరోత్సవం ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, కమిటీసభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమాలకు సాహితీవేత్త నోరి నారాయణ మూర్తి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య అధ్యక్షత వహించారు. శ్రీ వశిష్ఠాశ్రమ ఉత్తర పీఠాధిపతి, సర్వాధికార ప్రతినిధి కారంచేడు శ్రీవిశ్వంభరానందగిరి స్వామివారు భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. సభలో ఉపన్యాసకులుగా నారాయణం ప్రసాదాచార్యులు, అతిథులుగా గుంటూరు ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ యేల్చూరి వెంకటేశ్వర్లు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ నిమ్మల శేషయ్య, పారిశ్రామికవేత్త చుక్కపల్లి రమేష్ తదితరులు ప్రసంగించారు.


నగరోత్సవంలో పాల్గొన్న భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు

అరండల్‌పేట పరిధిలోని లాడ్జిలలో తనిఖీలు


లాడ్జిలో తనిఖీలు నిర్వహిస్తున్న అరండల్‌పేట సీఐ వీరాస్వామి

గుంటూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అరండల్ పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ని పలు లాడ్జిలు, హోటళ్లలో సోమవారం సీఐ వీరస్వామి ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. లాడ్జిలలో పేకాట, వ్యభిచారం, ఇతర అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేసేందు కు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా హోటళ్ళు, లాడ్జిల యజమానులకు హెచ్చరికలు జారీ చేశారు. లాడ్జిలు, హోటళ్ళలో గదులు కేటాయించే సందర్భంలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని వారికి సూచించారు. ప్రతి ఒక్కరి గుర్తింపుకార్డు, ఆధార్ కార్డు తీసుకోవాలని సూచించారు. లాడ్జిలు, హోటళ్లలో అసాంఘిక కార్యకలాపాలు జరిగితే అందుకు లాడ్జి యాజమాన్యమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

టీఐఎస్‌లో సీనియార్టీ జాబితాపై అభ్యంతరాలు తెలపాలి

● డీఈఓ రేణుక

గుంటూరు(విద్య), మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమాచార వ్యవస్థలో(టీఐఎస్) ఉన్న సీనియార్టీ జాబితాపై అభ్యంతరాలను ఈనెల 10 లోగా తెలపాలని డీఈఓ సీవీ రేణుక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ, మండల పరిషత్, మున్సిపల్, కార్పొరేషన్ స్కూళ్లలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వెబ్‌సైట్, ఆర్జేడీ, డీఈఓ కార్యాలయాల్లోని నోటీసు బోర్డులో ఉన్న జాబితాలను పరిశీలించి అభ్యంతరాలను తెలపాలని సూచించారు. అభ్యంతరం తెలియజేసే ఉపాధ్యాయుడి పేరు, పదవి, సంబంధిత వివరాలు, సీనియార్టీ జాబితాలో తప్పిదం ఎక్కడ జరిగిందో ఆధారాలతో తెలపాలని సూచించారు నిర్దేశించిన గడువులోగా అభ్యంతరాలు తెలపాలని సూచించారు. వివరాల కోసం విద్యాశాఖ, ఆర్జేడీ కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

వైభవంగా స్వామి వారి కల్యాణం


స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గుంటూరు (తూర్పు), మార్చి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక మారుతీనగర్, మారుతీ దేవాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న 39వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిత్య హోమాలు, ఆలయంలో వేంచేసిన శ్రీ గంగా గౌరీ సమేత గౌరీశంకరస్వామికి మహన్యాస ఏకాదశి రుద్రాభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారికి శాంతికల్యాణం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ ఎన్వీ రమణమూర్తిచే శ్రీకృష్ణరాయబారం హరికథాగానం జరిగింది. కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. కార్యక్రమాలను కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షించారు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు ఉద్యోగనగర్, ఎస్‌వీఎన్ కాలనీ, నేతాజీనగర్, వైష్ణవినగర్, తారకరామనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుంటూరు టౌన్-2 డిప్యూటీ ఈఈ ఎన్ గురవయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

మాదకద్రవ్యాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

గుంటూరు(విద్య), మార్చి 3(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్తును విద్యార్థులు, యువత నాశనం చేసుకోవద్దని ఎంఈఓ రమణయ్య అన్నారు. సోమవారం పొత్తూరువారి తోటలోని ఎస్‌పీకేహెచ్ ఉన్నత పాఠశాలలో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నవజీవన్ బాలభవన్ జోనల్ కోఆర్డినేటర్ బి.రమేష్, జీ శేఖర్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈత పోటీలలో విజేతకు అభినందనలు

గుంటూరు(తూర్పు), మార్చి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇన్నర్ రింగురోడ్డు నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఆదివారం జరిగిన స్విమ్మింగ్ పోటీలలో రూరల్ మండలం జొన్నలగడ్డ గ్రామానికి చెందిన కలవకొల్లు విజయ శ్రీరాఘవ ప్రతిభ కనబరిచారు. 6 కిలోమీటర్ల విభాగంలో కేవలం నాలుగు గంటల్లోనే పూర్తిచేశారు. అంతేగాక జనవరిలో రాజమండ్రిలో జరిగిన 1 కిలోమీటర్ల కెనాల్ స్విమ్మింగ్, 100 మీటర్లు ఫ్రీస్టైల్ విభాగంలో రజతపతకం సాధించారు. ఈ సందర్భంగా విజయ శ్రీరాఘవను శ్రీవారి సేవాసమితి అధ్యక్షుడు వంగా నవీన్‌రెడ్డి, గ్రామ ఉపాధ్యక్షుడు నామా శ్రీనివాసరావు, జనసేన నాయకులు ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

నోటీసు

IN THE COURT OF THE I ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION): GUNTUR
E.A.No. 128/2024, E.A.No.119/2022 in E.P. No. 108/2006
in O.S.No. 494/1990

Between :
Shaik Hussain Saheb ... Petitioner / DHR
And
Yakkaluri Ademma & Others ... Respondents/JDR/s

To,
R-1 : Yakkaluri Ademma, W/o. Subba Reddy, R/o. Main Road, Anjaneyapeta, Near Koritepadu, Guntur.
R-2 : Yakkaluri Veeramma W/o. Pulla Reddy (Died).
R-3 : Yakkaluri Veeramma, D/o. Late Subba Reddy, R/o. D.No. 4-8-77, Main Road, Anjaneyapeta, Near Koritepadu, Guntur.

ఈ నెంబరు ఇపిలోని 2వ జె.డి.ఆర్. చనిపోయినందున 2వ జె.డి.ఆర్. స్థానే 3వ రెస్పాండెంట్‌ను ఎల్.ఆర్.గా చేర్చమని పై నెంబరు పిటీషన్ దాఖలు చేయగా సదరు 3వ రెస్పాండెంట్‌కు ఎన్నిసార్లు నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున పేపర్ పబ్లికేషన్ నిమిత్తము ది. 11-03-2025నకు వాయిదా వేసినారు. కావున 3వ రెస్పాండెంట్ వాయిదా రోజు ఉ॥గం॥ 10-30 ని॥లకు పై కోర్టువారి ఎదుట హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపు కొనవలయును. లేని యెడల మీపరోక్షమున తీర్మానించబడును.

కె. దేవానంద్
పిటీషనర్/డి.హెచ్.ఆర్.తరపు అడ్వకేట్, గుంటూరు

తమిళనాడ్ మర్కంటైల్ బ్యాంక్ లిమిటెడ్
గుంటూరు బ్రాంచ్, డో.నెం.24-2-49, [illegible] చుండూరు [illegible], గుంటూరు, ఏపి-522003, ఫోన్: 0863-2222964.

శీతల గిడ్డంగిలోని నిల్వల (ఎండుమిర్చి) అమ్మకపు వేలం వాయిదా ప్రకటన
ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ది.12-02-2025 నాటి "ఆంధ్రజ్యోతి" దినపత్రికలలో ప్రచురించబడిన విధంగా ది.01-03-2025న [illegible] ఋణగ్రహీతలు: శ్రీ [illegible] నాగేశ్వరరావు నాయక్ (074700220103264), శ్రీ వనమ ఉమామహేశ్వరరావు (074700220103242) కు చెందిన మిర్చి బస్తాల వేలం ది.10-03-2025న తేదీకి [illegible]. మిగిలిన నియమ నిబంధనలలో ఎటువంటి మార్పు లేదు.
ప్రదేశం : గుంటూరు, తేది : 01-03-2025 సం/- అధీకృత అధికారి, తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ లిమిటెడ్.

సొంత ఖాతా నుంచే ఇంటి అద్దె చెల్లించా!

» 'ఆంధ్రజ్యోతి' కథనంపై రిటైర్డ్ పీసీసీఎఫ్ చిరంజీవ్ వివరణ

అమరావతి, మార్చి3(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని రాష్ట్ర అటవీ శాఖ ప్రధాన కార్యాలయ భవనానికి రెండేళ్ల తర్వాత ఇతర ప్రభుత్వ విభాగాలు చెల్లించే అద్దెతో సమానంగానే అద్దె సవరించినట్టు రిటైర్డ్ పీసీసీఎఫ్ చిరంజీవ్ చౌదరి తెలిపారు. భవన యజమాని అటవీ శాఖ కార్యాలయాన్ని ఖాళీ చేయాలని లేదా ఇతర శాఖలతో సమానంగా అద్దె చెల్లించాలని కోరినందున అద్దె పెంచినట్లు వివరించారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో అడవిలో 'కిమ్' రాజ్యం శీర్షికతో కథనం వచ్చిన నేపథ్యంలో ఆయన స్పందించారు. 2016నుంచి తాను రెయిన్ ట్రీ పార్కులో ఉంటుండగా, అదే సొసైటీకి చెందిన ప్రస్తుత ఇంటికి నెలకు రూ.50 వేలు తన వ్యక్తిగత బ్యాంక్ ఖాతా నుంచి అద్దె చెల్లిస్తున్నట్లు తెలిపారు. తన పదవీ కాలంలో ప్రభుత్వ వాహనాలను అధికారిక పనుల కోసమే వినియోగించానని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఎప్పుడూ వాడలేదన్నారు. పీసీసీఎఫ్‌గా వాడిన వాహనాలన్నీ పదేళ్ల కంటే పాతవని చెప్పారు. శాఖాపరమైన బదిలీలు, పోస్టింగ్‌ల్లో ఏ ఒక్కరి ప్రమేయం, అవినీతికి ఆస్కారం లేకుండా ఉపముఖ్యమంత్రి మద్దతుతోనే చేసినట్లు తెలిపారు. చాలాకాలంగా ఒకే పోస్టులో ఉన్న వారిని పరిపాలనా కారణాలతో బదిలీ చేయగా, కోర్టు నుంచి అనుకూల ఉత్తర్వులు పొందారన్నారు.

సిబ్బంది కొరత వల్లే రెండు షిఫ్టుల విధానం

» 'ఆంధ్రజ్యోతి' కథనంపై రాజమండ్రి జైలు సూపరింటెండెంట్ వివరణ

రాజమహేంద్రవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): జైలులో గార్డింగ్ సిబ్బంది కొరత కారణంగానే రెండు షిఫ్టుల విధానం అమలు చేస్తున్నామని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ పేర్కొన్నారు. జైళ్లశాఖ కోస్తాంధ్ర రీజియన్‌లో ఉన్నతాధికారికి, సిబ్బందికి నడుమ కొనసాగుతున్న వివాదంపై 'జైళ్ల శాఖ.. కోస్తాంధ్రలో కోల్డ్‌వార్' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై సూపరింటెండెంట్ తరఫున డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం.రాజకుమార్ వివరణ ఇచ్చారు. జైలులో 220మంది గార్డింగ్ సిబ్బందికి గాను 155మంది మాత్రమే ఉన్నారన్నారు. షఢక్ అనే ఓపెన్ జైలు ఖైదీని డీఐజీ కార్యాలయంలో ఏసీ మరమ్మతు నిమిత్తం పంపించామని వివరించారు. ఈ విషయంలో కిందిస్థాయి ఉద్యోగిని సస్పెండ్ చేయలేదని, శాఖాపరమైన విచారణ కొనసాగుతోందన్నారు.

టెన్త్ హాల్‌టికెట్లు విడుదల

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్లను విడుదల చేసినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం సోమవారం తెలిపింది. విద్యార్థులు పాఠశాల లాగిన్ ద్వారా లేదా మన మిత్ర వాట్సాప్ నంబరు ద్వారా నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించింది. విద్యార్థులకు మంత్రి నారా లోకేశ్ 'ఆల్ ది బెస్ట్' చెప్పారు. కాగా ఈ నెల 17 నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

గ్రూప్2 అభ్యర్థులకు హారిజంటల్ రిజర్వేషన్

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదల చేసిన గ్రూప్-2 మెయిన్స్ నోటిఫికేషన్‌లో మహిళలు, దివ్యాంగులు, ఎక్స్ సర్వీస్‌మెన్, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి హారిజంటల్ రిజర్వేషన్ విధానం వర్తిస్తుందని ఏపీపీఎస్సీ సోమవారం ప్రకటించింది. సాధారణంగా అమలుచేసే వర్టికల్ రిజర్వేషన్‌లో భాగంగానే ఇది కూడా అమలవుతుందని తెలిపింది. హారిజంటల్ రిజర్వేషన్‌లో అర్హులైన మహిళా అభ్యర్థులు లేకపోతే ఆ పోస్టులను ప్రస్తుత నిబంధనల ప్రకారం భర్తీ చేస్తామంది.


గ్రూప్-2 వెబ్ ఆప్షన్లపై నిరుద్యోగ జేఏసీ హర్షం

విజయవాడ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): 'గ్రూప్-2 అభ్యర్థుల విన్నపాలను గౌరవించి వెబ్ ఆప్షన్లు పెట్టుకోమని తెలియజేయటం శుభ పరిణామం' అని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమంత్ కుమార్ సోమవారం హర్షం వ్యక్తంచేశారు. వైసీపీ ప్రభుత్వంలో నోటిఫికేషన్ల ఆలస్యం కారణంగా వేలమంది వయోపరిమితి కోల్పోయారని, వయోపరిమితి పెంచి నోటిఫికేషన్లు ఇచ్చి ఆదుకోవాలని ఆయన కోరారు.

దేవదాయశాఖ కమిషనర్‌గా రామచంద్రమోహన్ అర్హులే

» హైకోర్టు స్పష్టీకరణ

» పిటిషన్ కొట్టివేత.. 25 వేలు ఖర్చులు విధింపు



అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టేందుకు అడిషనల్ కమిషనర్ రామచంద్రమోహన్ అర్హులేనని హైకోర్టు తేల్చిచెప్పింది. మూడో వ్యక్తి ప్రోద్బలంతో పిటిషనర్ ప్రస్తుత వ్యాజ్యాన్ని దాఖలు చేశారని పేర్కొంది. కోర్టు విచారణ ప్రక్రియను దుర్వినియోగం చేస్తున్నారనేందుకు ఈ కేసు మంచి ఉదాహరణ అని తెలిపింది. వ్యాజ్యాన్ని కొట్టివేస్తూ పిటిషనర్ రమణమూర్తికి రూ.25వేలు ఖర్చులు విధించింది. ఈ సొమ్మును నాలుగు వారాల్లో ఏపీ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీకి చెల్లించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి ఫిబ్రవరి 28న తీర్పు ఇచ్చారు. సోమవారం తీర్పు ప్రతి అందుబాటులోకి వచ్చింది. దేవదాయ శాఖ అడిషనల్ కమిషనర్ రామచంద్రమోహన్ అక్రమాలపై రాష్ట్ర విజిలెన్స్ విచారణ పూర్తయ్యేవరకు ఆయనను దేవదాయశాఖలో కొనసాగించకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ మచిలీపట్నానికి చెందిన వీవీ రమణమూర్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దేవదాయశాఖ కమిషనర్‌గా రామచంద్రమోహన్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సీఎస్ ఇచ్చిన ఉత్తర్వుల అమలును నిలుపుదల చేయాలని పిటిషన్‌లో కోరారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల తుది విచారణ జరిపిన న్యాయమూర్తి నిర్ణయాన్ని వెల్లడించారు. 'దేవదాయ శాఖ చట్టంలోని సెక్షన్ 3, 4 ప్రకారం అడిషనల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వ్యక్తి కమిషనర్‌గా నియమితులయ్యేందుకు అర్హులు. చట్టంలోని సెక్షన్ 3(2) ప్రకారం హిందూ మతాన్ని ఆచరించనప్పుడు మాత్రమే కమిషనర్ పోస్టుకు అనర్హులు. వరాహలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, మన్సాస్ ట్రస్ట్ ఈవోగా అక్రమాలకు పాల్పడ్డారంటూ త్రిసభ్య కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా రామచంద్రమోహన్‌ను గతంలో సస్పెండ్ చేశారని, హైకోర్టును ఆశ్రయించి మధ్యంతర ఉత్తర్వులు పొందడం ద్వారా తిరిగి విధుల్లో చేరారని పిటిషనర్ రమణమూర్తి వ్యాజ్యంలో పేర్కొన్నారు. 'ఇన్‌చార్జి కమిషనర్‌గా రామచంద్రమోహన్ ఏవిధంగా అనర్హుడో అఫిడవిట్‌లో పేర్కొనలేదు. మూడో వ్యక్తి ప్రోద్బలంతో పిటిషనర్ ప్రస్తుత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. కోర్టు విచారణ ప్రక్రియను దుర్వినియోగం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పిటిషన్‌ను కొట్టివేస్తున్నాం' అని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

ఈ నెలలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్

» పాఠశాల విద్యలో విప్లవాత్మక సంస్కరణలు

» ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వర్క్‌షాప్‌లో లోకేశ్



ఏపీ విద్యావిధానంపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో నిర్వహించిన వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్, పాల్గొన్న ఎమ్మెల్యేలు కాల్వ శ్రీనివాసులు, సోమిరెడ్డి, పల్లా శ్రీనివాసరావు, కళా వెంకట్రావు, పరిటాల సునీత, మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్సీ అనురాధ తదితరులు

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యలో విప్లవాత్మక సంస్కరణలు తెస్తున్నట్టు మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ నెలలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఏపీ మోడల్ ఎడ్యుకేషన్, జీవో 117కు ప్రత్యామ్నాయం, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలపై కూటమి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సోమవారం ఉండవల్లిలోని నివాసంలో వర్క్‌షాప్ నిర్వహించారు. విద్యారంగంలో ఎలాంటి మార్పులు చేపడితే బాగుంటుందనే దానిపై వారి నుంచి అభిప్రాయాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసి, దేశంలోనే ఏపీ విద్యా వ్యవస్థను నంబర్ 1 చేయాలన్న సీఎం చంద్రబాబు లక్ష్యానికి అనుగుణంగా సంస్కరణలకు శ్రీకారం చుట్టామన్నారు. తాను యువగళం పాదయాత్ర చేస్తున్నప్పుడు జీవో 117 వల్ల కలిగిన దుష్ఫలితాల గురించి అనేక మంది తన దృష్టికి తెచ్చారని గుర్తుచేశారు. జీవో 117 పేరుతో వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల గత ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో 12 లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయారన్నారని, వారంతా ప్రైవేటు పాఠశాలల్లో చేరారని చెప్పారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే నివేదిక ప్రకారం జాతీయ సగటుతో పోలిస్తే ఏపీ పాఠశాల విద్యలో ఎక్కువ అభ్యసన అంతరం ఏర్పడిందన్నారు. 3వ తరగతి విద్యార్థుల్లో.. భాషా సబ్జెక్టుల్లో 57శాతం మంది, గణితంలో 54శాతం మంది మాత్రమే అంచనా మేరకు మెరుగ్గా ఉన్నారన్నారు. ఇది జాతీయ సగటుతో పోలిస్తే 5 నుంచి 8శాతం తక్కువని చెప్పారు. పైతరగతుల్లో ఈ అంతరం ఇంకా ఎక్కువగా ఉందన్నారు. అసర్-2024 నివేదిక రాష్ట్రంలో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీలో లోపాలను బహిర్గతం చేసిందన్నారు. పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ నివేదిక ప్రకారం టీచర్ విద్య శిక్షణలో ఏపీ 60 పాయింట్లు సాధించిందన్నారు.

నియోజకవర్గానికో మోడల్ స్కూల్!

గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దేందుకు జీవో 117 రద్దుచేసి, ప్రత్యామ్నాయం తీసుకొచ్చే ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి లోకేశ్ తెలిపారు. సీబీఎస్ఈపై విద్యార్థులకు మాక్ పరీక్ష నిర్వహిస్తే 90శాతం మంది ఫెయిల్ అయ్యారని తెలిపారు. ఐబీ సిలబస్ పేరుతో రూ.5 కోట్లు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అందరం కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. విద్యారంగంలో ఉత్తమ విధానాల అమలుకు టీచర్లను విదేశాలకు పంపుతామన్నారు. అంతర్జాతీయంగా వస్తున్న మార్పులపై కొందరు టీచర్లు పోలాండ్‌లో అధ్యయనం చేస్తారని తెలిపారు. దేశంలోనే అత్యున్నత ప్రమాణాలతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. రాబోయే ఐదేళ్లలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్స్, బెంచీలు, తాగునీరు, మరుగుదొడ్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తామన్నారు. గంజాయి, డ్రగ్స్ నివారణకు 'డ్రగ్స్ వద్దు బ్రో' పేరుతో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ నెలలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని మంత్రి వెల్లడించారు.

ప్రజాప్రతినిధుల సూచనలు ఇవీ..

ప్రభుత్వ పాఠశాలల్లో కనీస స్థాయిలో అయినా విద్యార్థుల సంఖ్య ఉంటే ఇబ్బందులుండవని, దీనికి ఎమ్మెల్యేలు చొరవ తీసుకోవాలని కొణతాల రామకృష్ణ అన్నారు. శివారు ప్రాంతాలున్న గ్రామాల్లో విద్యార్థులకు రవాణా ఇబ్బంది లేకుండా చూడాలని బండారు సత్యనారాయణమూర్తి కోరారు. మోడల్ ప్రైమరీ స్కూల్‌కు కనీస విద్యార్థుల సంఖ్య 45 చేయాలని లోకం మాధవి సూచించారు. గురుకుల పాఠశాలలు పెంచాలని కొవ్వూరు ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు కోరారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లోని విద్యార్థులకు ఎంసెట్, ఐఐటీ కోచింగ్ నిర్వహించాలని కొండబాబు కోరారు. అదనపు తరగతి గదుల నిర్మాణానికి సమగ్ర ప్రణాళిక అమలుచేయాలని కాల్వ శ్రీనివాసులు సూచించారు.

18 మీటర్ల లోపు ఎత్తు భవన నిర్మాణాలకు

స్వీయ ధ్రువీకరణ ఇస్తే సరి

» టౌన్‌ప్లానింగ్ అధికారుల అనుమతి అవసరం లేదు!

» భవన నిర్మాణదారులకు ఏపీ సర్కారు శుభవార్త

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణదారులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇకపై 18 మీటర్ల లోపు లేదా ఐదంతస్తుల లోపు భవన నిర్మాణ అనుమతులకు స్వీయ ధ్రువీకరణ పత్రం ఇస్తే సరిపోతుంది. టౌన్‌ప్లానింగ్ అధికారుల అనుమతి అవసరం లేకుండానే భవన నిర్మాణాలకు అనుమతి వస్తుంది. అయితే భవన యజమానులు రిజిస్టర్డ్ ఎల్‌టీపీలు, ఇంజనీర్లు లేదా ఆర్కిటెక్ట్‌ల సమక్షంలో సరైన పత్రాలు సమర్పించి అఫిడవిట్ ఇవ్వాలి. దీనికి సంబంధించి గత నెలలోనే భవన నిర్మాణ అనుమతులకు కొత్త విధానం అమల్లోకి తీసుకొస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసినప్పటికీ సాంకేతిక కారణాలతో జాప్యం జరిగింది. భవన నిర్మాణాల అనుమతుల ప్రక్రియను త్వరితగతిన జారీచేసేలా ఈ కొత్త విధానాన్ని సర్కార్ అందుబాటులోకి తీసుకొచ్చింది. సెల్ఫ్ సర్టిఫికేషన్ ద్వారా నిర్మాణాలకు అనుమతులిచ్చేందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను ఏపీడీపీఎంఎస్ పోర్టల్‌లోకి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఈ విధానం ఆమోదం పొందిన లేఅవుట్లు, గ్రామ కంఠం, సర్క్యులేషన్ ప్లాన్లు ఉన్న ప్రాంతాలు, 1985కు ముందు నిర్మించిన భవనాల పునర్నిర్మాణానికి ఉపయోగపడుతుందని మంత్రి చెప్పారు.

పర్చూరు ఓట్ల తొలగింపు కుట్రపై 'సిట్'

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో విజయం సాధించడానికి అక్రమ మార్గంలో ఓట్ల తొలగింపునకు పాల్పడిన వారి గుట్టు రట్టు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ నేతృత్వంలో గుంటూరు పశ్చిమ డీఎస్పీ అరవింద్‌తోపాటు మరికొందరు పోలీసుల్ని సభ్యులుగా నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ హయాంలో బాపట్ల జిల్లా పర్చూరులో గుట్టు చప్పుడు కాకుండా 24 వేల మంది ఓటర్లకు సంబంధించి ఫారమ్ 7 ఇచ్చి ఓట్ల తొలగింపునకు ప్రయత్నించారు. అప్పటి ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కూటమిసర్కారుకి మరోసారి ఫిర్యాదు చేయగా పరిశీలించిన ప్రభుత్వం 'సిట్' ఏర్పాటు చేసింది.



చిత్రజ్యోతి SINCE 1965

ఆస్కార్ వేడుకలు.. అనోరాకు అగ్రస్థానం



ప్రపంచ సినీ రంగంలో ఉన్నత పురస్కారంగా భావించే 97వ ఆస్కార్ అవార్డుల వేడుక కన్నులపండువగా సాగింది. అమెరికాలోని లాస్‌ఏంజిల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో ఆదివారం సాయంత్రం (భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం) నిర్వహించిన ఈ కార్యక్రమానికి కానన్ ఓబ్రియాన్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఆయన భారతీయులను ఉద్దేశించి హిందీలో మాట్లాడడంతో పాటు 'బ్రేక్ ఫాస్ట్ చేశారా' అని అనడం అందర్నీ ఆకట్టుకుంది.

ఈ వేడుకలో అందర్నీ ఆశ్చర్యపరిచిన చిత్రం 'అనోరా'. చిన్న చిత్రంగా తెరకెక్కిన ఈ సినిమా ఏకంగా ఐదు అకాడమీ అవార్డులను దక్కించుకుంది. ఉత్తమ చిత్రం, ఎడిటింగ్, స్క్రీన్ ప్లే, దర్శకుడు, నటి విభాగంలో పురస్కారాలు దక్కించుకుంది. దర్శకత్వంతో పాటు ఎడిటింగ్, స్క్రీన్ ప్లే అందించిన సీన్ బేకర్.. ఒకే చిత్రానికి నాలుగుసార్లు అవార్డు అందుకున్న మొదటి వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. వాల్ట్ డిస్నీ గతంలో వేర్వేరు సినిమాల ద్వారా నాలుగు అవార్డులను అందుకున్న సంగతి తెలిసిందే. సీన్ బేకర్ ఈ అవార్డును వేశ్యలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ థియేటర్ల మనుగడను కాపాడాల్సిన అవసరాన్ని చెప్పారు.

ఉత్తమ నటుడిగా అడ్రియన్ బ్రాడీ

బ్రాడీ కార్బెట్ తెరకెక్కించిన 'ద బ్రూటలిస్ట్' చిత్రానికి గాను ఉత్తమ నటుడిగా అవార్డును అందుకున్నారు అడ్రియన్ బ్రాడీ. ఆయనకు ఇది రెండో ఆస్కార్ పురస్కారం. 2002లో రోమన్ పొలాన్‌స్కీ దర్శకత్వంలో తెరకెక్కిన 'పియానిస్ట్' అతి పిన్న వయస్కుడిగా తొలిసారి ఆస్కార్‌ను అందుకున్నారు. ఈ రెండు సినిమాలు హోలోకాస్ట్ నేపథ్యంలో రూపొందినవే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధించిన విజయాలు, ఘనతలు శాశ్వతం కాదని తెలిపారు. అలాగే, 'ద రియల్ పెయిన్' చిత్రానికి గాను ఉత్తమ సహాయ నటుడిగా అవార్డును అందుకున్నారు కీరన్‌కైల్ కల్కిన్.

ఉత్తమ నటిగా మైకీ మ్యాడిసన్

'అనోరా' చిత్రానికి ఉత్తమ నటిగా పురస్కారం అందుకున్నారు మైకీ మ్యాడిసన్. ఈ రొమాంటిక్ కామెడీ డ్రామాలో ఆమె వేశ్య పాత్రలో నటించారు. ఈ అవార్డును అందుకోవడం కలలా ఉందని మ్యాడిసన్ చెప్పారు. అలాగే, 'ఎమిలియా పెరెజ్' చిత్రానికి గాను ఉత్తమ సహాయ నటిగా జో సాల్డాన అవార్డును అందుకున్నారు. అత్యధిక నామినేషన్లతో రేసులో నిలిచిన నాన్ ఇంగ్లీష్ చిత్రం 'ఎమీలియా పెరెజ్' కేవలం రెండు అవార్డులతో సరిపెట్టుకుంది. పది నామినేషన్లు సాధించిన 'బ్రూటలిస్ట్' చిత్రం మూడు అవార్డులు పొందింది. 'డ్యూన్ 2' చిత్రం రెండు అవార్డులను సొంతం చేసుకుంది.

ఆస్కార్ బృందంలో తెలంగాణ వాసి పాత్ర



ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్‌లో పురస్కారం పొందిన 'డ్యూన్ 2' చిత్రం వీఎఫ్ఎక్స్ టీమ్‌లో తెలంగాణ వాసి ఉండడం విశేషం. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మునిసిపాలిటీ అమినాపురంకు చెందిన ఎడ్ల సుమంత్‌రెడ్డి ఈ చిత్రానికి ఆరు క్యారెక్టర్లను డిజైన్ చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.

కేసముద్రం (ఆంధ్రజ్యోతి)

విజేతల వివరాలు

ఉత్తమ చిత్రం: అనోరా
ఉత్తమ దర్శకుడు: సీన్ బేకర్ (అనోరా)
ఉత్తమ నటుడు: అడ్రియన్ బ్రాడీ (ద బ్రూటలిస్ట్)
ఉత్తమ నటి: మైకీ మ్యాడిసన్(అనోరా)
ఉత్తమ సహాయ నటుడు: కీరన్‌కైల్ కల్కిన్ (ద రియల్ పెయిన్)
ఉత్తమ సహాయ నటి: జో సాల్డాన (ఎమిలియా పెరెజ్)
ఉత్తమ ఎడిటింగ్ : అనోరా (సీన్ బేకర్)
ఉత్తమ సినిమాటోగ్రఫీ: ద బ్రూటలిస్ట్ (లాల్ క్రాలే)

అనూజకు నిరాశ

భారత్ తరఫున ఆస్కార్ నామినేషన్ పొందిన లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్ 'అనూజ' చిత్రానికి నిరాశ ఎదురైంది. ఈ విభాగంలో పోటీపడుతున్న చిత్రాలను ఓడించి, 'ఐ యామ్ నాట్ ఏ రోబో' లఘు చిత్రం పురస్కారాన్ని కైవసం చేసుకుంది.

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి 98484 11050 99854 03281

రేపటి నుంచి నృసింహుని బ్రహ్మోత్సవాలు

మంగళగిరి సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 5 నుంచి 16వ తేదీ వరకు జరుగనున్నాయి. దిగువ సన్నిధిలోని ఆలయంలో బుధవారం ఉదయం పెండ్లి కుమారుని ఉత్సవంతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడతారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలలో అత్యంత ప్రధాన ఘట్టమైన ధ్వజారోహన కార్యక్రమాన్ని ఈ నెల 6వ తేదీ రాత్రి నిర్వహిస్తారు. మరుసటి రోజు నుంచి స్వామివారి వాహన సేవలు ఆరంభమవుతాయి. 7న హనుమంత వాహనం, 8న రాజాధిరాజ వాహనం, 9న ఉదయం ముత్యాల పల్లకీ సేవ, రాత్రి యాలి వాహనం, 10న ఉదయం చిన్న శేష వాహనం, రాత్రి సింహ వాహనం, 11న ఉదయం హంస వాహనం, రాత్రి గజ వాహనం, 12న ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి పొన్న వాహన సేవ, 13న ఉదయం అశ్వ వాహనంపై గ్రామోత్సవం జరుగుతాయి. 13వ తేదీన అర్ధరాత్రి స్వామివార్ల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుంది. 14న ఉదయం శ్రీదేవీ, భూదేవీ సమేతుడైన శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారు


శ్రీ రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనృసింహస్వామి

ప్రత్యేకంగా అలంకరించిన బంగారు గరుడ వాహనంపై గ్రామోత్సవంలో పాల్గొంటారు. అదే రోజు మధ్యాహ్నం వేలాది మంది భక్తజన సందోహం నడుమ శ్రీవారి దివ్య రథోత్సవం కన్నుల పండువగా సాగుతుంది. దీనినే ప్రఖ్యాతి గాంచిన మంగళగిరి తిరునాళ్లగా వ్యవహరిస్తారు. 15వ తేదీన ఉదయం 8 గంటలకు చక్రవారి చూర్ణోత్సవం, వసంతోత్సవం, అదేరోజు రాత్రి ధ్వజ అవరోహణం, కేళిగుర్రం, దొంగల దోపిడీ తదితర కార్యక్రమాలు జరుగుతాయి. అనంతరం 16వ తేదీన జరిగే శ్రీ పుష్ప యాగోత్సవంతో బ్రహ్మోత్సవాలకు ముగింపు పలుకుతారు. అలాగే ఈ నెల 17 నుంచి 29వ తేదీ వరకు స్వామివారి ఆస్థాన అలంకారోత్సవాలు నిర్వహిస్తారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతిరోజు ఆలయం వద్ద వివిధ సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తారు. శ్రీ లక్ష్మీనృసింహస్వామి వార్ల భక్త బృందం కమిటీ ట్రస్టు ఆధ్వర్యంలో మిద్దె సెంటరులోని శ్రీ ప్రపత్తి ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద వేలాది మంది భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేయనున్నారు.

పశ్చిమ డెల్టా కాల్వకు 1016 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1016 క్యూసెక్కుల సాగునీటిని సోమవారం విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.9 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 190 క్యూసెక్కుల నీరు, తూర్పు కాల్వకు 132 క్యూసెక్కుల నీరు, పశ్చిమ కాల్వకు 125 క్యూసెక్కుల నీరు, నిజాంపట్నం కాల్వకు 55 క్యూసెక్కుల నీరు, కొమ్మమూరు కాల్వకు 720 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

రావెలలో బంగారు ఆభరణాలు అపహరణ

తాడికొండ(రావెల), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి ఇంటిలోకి దూరి బంగారు అభరణాలు అపహరణ చేసిన సంఘటనపై తాడికొండ పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడికొండ మండలం రావెల గ్రామానికి చెందిన దగ్గుమల్లి సాంబ్రాజ్యం ఫిబ్రవరి 26వ తేదీ ఉదయం స్నానం చేయటానికి వెళ్లే క్రమంలో బంగారు గొలుసు, నల్లపూసల గొలుసు తీసి ఇంటిలోని ఐరన్ అల్మారాలో ఉంచి వెళ్లింది. స్నానం చేసి తిరిగి వచ్చే సమయానికి గుర్తు తెలియని వ్యక్తి ఐరన్ అల్మారా దగ్గర నుంచి పరిగెత్తుకుంటూ బయటకు వెళ్లిపోయాడు. ఆభరణాలు కోసం వెతకగా బంగారు ఆభరణాలు దొంగతనం చేసి పారిపోయినట్లు గుర్తించి తన భర్త, పిల్లలకు తెలియజేసింది. బంగారు ఆభరణాల విలువ సుమారు రూ..1,60,000లు ఉంటాయి. అయితే ఇంటి చుట్టుపక్కల వారిని విచారించగా ఎలాంటి సమాచారం దొరకకపోవటంతో సోమవారం రాత్రి తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జోజీ తెలిపారు.

పశువులకు గాలికుంటు టీకాలు కొనసాగింపు

వట్టిచెరుకూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం వట్టిచెరుకూరు, ముట్లూరు, కాట్రపాడు పశు వైద్యశాలల పరిధిలోని గ్రామాల్లో పశువులకు గాలి కుంటు టీకాలను కొనసాగిస్తున్నారు. వట్టిచెరుకూరు డాక్టర్ కోటేశ్వరి, డాక్టర్ శివ శంకర్, డాక్టర్ భవ్యలు సహాయకుల సహకారంతో టీకాలు వేస్తున్నారు.

పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి : సీఐటీయూ

పెదనందిపాడు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఎండీఎం కార్మికులకు పెండింగ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్‌బాబు ఓ ప్రకటనలో కోరారు. మండలంలోని ఆయా పాఠశాలల్లో 54 మంది ఎండీఎం నిర్వాహకులు ఉన్నారని, వారికి 7 నెలలుగా జీతాలు అందకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికులను ఆదుకుంటామని హామీ ఇచ్చారని, హామీ మేరకు ఆదుకోవాలన్నారు. రాజకీయ నాయకులు నిర్వాహకులపై వేధింపులు ఆపాలని, భోజనం బాగోలేదని, పాఠశాలలో లేరని పలు వేధింపులకు గురి చేస్తున్నారని పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు ఇవ్వడంతో పాటు ఆందోళన కార్యక్రమాలు చేయడం జరిగిందని, మొక్కుబడిగా అప్పుడు ఒకటి, రెండు నెలలకు జీతాలు వేస్తున్నారని, వారికి కనీస వేతనం రు.10 వేలు ఇవ్వాలని కోరారు.

వివేకానందలో ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శన

మంగళగిరి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివేకానంద విద్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విజ్ఞాన ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థులు తాము రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శనలో ఉంచారు. స్మార్ట్ సిటీ, డ్యాం,


విజ్ఞాన ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

డైజెస్టివ్ సిస్టం, హైడ్రో ఎలక్ట్రిసిటీ, యానిమల్ హాబిటేషన్స్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్ నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ సైన్సు మనిషి రోజువారీ జీవితంలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. సైన్స్ ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో మేథస్సు పెరుగుతుందని, భవిష్యత్తులో సరికొత్త ఆవిష్కరణలకు నాంది పలికే అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు సైన్సు ప్రదర్శనను తిలకించి పిల్లలను అభినందించారు.

తైక్వాండోలో మంగళగిరి విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్ నరేంద్ర

మంగళగిరి సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యాన కోట్ల విజయభాస్కరరెడ్డి స్టేడియంలో ఈ నెల 1, 2 తేదీల్లో జరిగిన 13వ ఇంటర్ స్కూల్ టైక్వాండో చాంపియన్‌షిప్‌లో మంగళగిరి ఈగల్ మార్షల్ ఆర్ట్స్ క్లబ్ విద్యార్థులు పతకాలు సాధించినట్లు కోచ్ చిల్లపల్లి నరేంద్ర తెలిపారు. మొత్తం పది మంది క్రీడాకారులు పాల్గొనగా, సబ్ జూనియర్స్‌లో కే.నాగమణికంఠ రజత పతకం, బి.జస్విత, ఎస్.జయశ్రీకర్‌రెడ్డి, ఐ.లిఖితాక్షర్, ఈ.ధీరజ్, యూ.ధనుష్‌కు మార్లు కాంస్య పతకాలను సాధించినట్లు చెప్పారు. కాజ గ్రామంలోని ఈగల్ మార్షల్ ఆర్ట్స్ కార్యాలయంలో సోమవారం చిన్నారులకు పతకాలు,సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. పతకాలు సాధించిన విద్యార్థులను పలువురు ప్రముఖులు అభినందించారు.

విద్యార్థులు సామాజిక స్పృహ అలవర్చుకోవాలి


స్కౌట్‌లో చేరిన విద్యార్థులతో ఎంఈవో బాబు, ఉపాధ్యాయులు

మంగళగిరి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు సామాజిక స్పృహను అలవర్చుకోవాలని మంగళగిరి ఎంఈవో ఎస్.బాబు సూచించారు. మంగళగిరి మండలం నూతక్కి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుభాష్ చంద్రబోస్ పేరిట బాలుర స్కౌట్స్ ఝాన్సీ లక్ష్మీబాయి పేరిట బాలికల గైడ్‌ను సోమవారం ప్రారంభించారు. స్కౌట్స్ వ్యవస్థాపకుడు బైడన్ పాల్ చిత్రపటానికి నివాళులర్పించి బాలబాలికలచే ప్రతిజ్ఞ చేయించారు. ఎంఈవో బాబు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావం కలిగి ఉండాలన్నారు. విపత్కర పరిస్థితుల్లో దేశానికి సేవ చేసేలా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి ఎం.ఏడుకొండలు, ప్రధానోపాధ్యాయుడు రాజీవ్‌రత్న, శ్రీలక్ష్మీ, దుగ్గిరాల గైడ్ కెప్టెన్ కే.కామాక్షి, పెదకొండూరు గైడ్ కెప్టెన్ సీహెచ్ రజనీ, స్కౌట్ మాస్టర్ కే.రజని నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నివేశన స్థలాల కోసం అర్జీలు అందజేత


లబ్ధిదారులతో కలిసి సచివాలయంలో అర్జీలు అందజేసిన సీపీఐ నేతలు

మంగళగిరి సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు నివేశన స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో లబ్ధిదారులు సోమవారం నవులూరులోని మక్కెవారిపేట సచివాలయంలో అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల చొప్పున పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సాయం అందించాలని, నియోజకవర్గంలో ఎంతో కాలంగా నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్‌రావు, నేతలు రాచకొండ శివ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పంపిణీ

ఫిరంగిపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు బీఆర్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా పరీక్ష ప్యాడ్స్ పంపిణీ చేశారు. మండలంలోని ఫిరంగిపురం సెయింట్ ఆన్స్ బాలికోన్నత పాఠశాల, సెయింట్ జోసెఫ్ ఇంగ్లీషు


విద్యార్థులకు ప్యాడ్స్ పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం సిస్టర్ వట్టి తేరేసమ్మ

మీడియం స్కూల్, అమీనాబాద్‌లో గల బీఆర్‌సీ హైస్కూల్ విద్యార్థినీ, విద్యార్థులకు సోమవారం ప్యాడ్స్‌ను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ అకాడమీ డైరెక్టర్ భువనేశ్వరి, ఎస్‌టీయూ మండల అధ్యక్షుడు పాలడుగు ప్రసాదు, కే.కిషోర్, పీ.రాజారావు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు బిక్కి సునంద, జాన్, సిస్టర్ వట్టి థేరేసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభాన్ని తొలగించిన అధికారులు

ఫిరంగిపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 113 తాళ్ళూరు గ్రామంలో శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానంలో పడిపోవటానికి సిద్ధంగా ఉన్న ధ్వజ స్తంభాన్ని దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారులు,


ధ్వజ స్తంభం తొలగింపు వద్ద డేగల ప్రభాకర్, వివిధ శాఖల అధికారులు

పోలీసులు, రాష్ట్ర పరిశ్రమల శాఖ చైర్మన్ డేగల ప్రభాకర్‌ల సమక్షంలో ఎక్స్‌కవేటర్‌తో ధ్వజ స్తంభాన్ని తొలగించారు. ఈనెల 17వ తేదీన నూతన ధ్వజ స్తంభాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు.

సైన్స్‌లో సవాళ్లపై అంతర్జాతీయ సదస్సు

తాడికొండ(మోతడక)మార్చి 3:(ఆంధ్రజ్యోతి): మోతడక చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో మార్చి 26, 27 తేదీల్లో రీసెంట్ చాలెంజెస్ ఇన్ సైన్స్, ఇంజనీరింగ్, టెక్నాలజీలపై అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు చలపతి విద్యా సంస్థల ఛైర్మన్ వైవీ ఆంజనేయులు అన్నారు. మోతడక చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం అంతర్జాతీయ సదస్సు కరపత్రాలను ఆవి


అంతర్జాతీయ సదస్సు వాల్‌పోస్టర్స్‌ను ఆవిష్కరిస్తున్న వైవీ ఆంజనేయులు తదితరులు

ష్కరించారు. ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ సదస్సు తాజా అనువర్తనాలు, వినూత్న పరిశోధనలు, వివిధ అధ్యయనాలను చర్చించేందుకు గొప్ప వేదికగా నిలుస్తుందన్నారు. పరిశోధన పత్రాలను సమర్పించటానికి ఈనెల 17వ తేదీతో ముగుస్తుందని తెలిపారు. అంతర్జాతీయ సదస్సులో విద్యార్థులు, అధ్యాపకులు, శాస్త్రవేత్తలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కే.నాగ శ్రీనివాసరావు, ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రమారావు, డైరెక్టర్ డీ.వినయ్‌కుమార్, డీన్స్ డాక్టర్ ఫణికుమార్, డాక్టర్ బాల మురళి, డాక్టర్ వీవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు చానల్ విస్తరణకు నిధుల కేటాయింపు అభినందనీయం

టీడీపీ మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణ



వట్టిచెరుకూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, రైతాంగానికి అండగా ఇచ్చిన హామీలకు కట్టుబడి పని చేస్తుందనటానికి గుంటూరు ఛానల్ పొడిగింపు, విస్తరణకు నిధులు కేటాయించటమే నిదర్శనమని టీడీపీ మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరావు కొనియాడారు. గత ప్రభుత్వంలో గుంటూరు చానల్ విస్తరణ, పొడిగింపుపై ఆనాటి వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ఎన్నికల హామీలను గాలికి వదిలి వేశారని, నేటి కూటమి ప్రభుత్వం అభ్యర్థులుగా ఎంపీ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఎన్నికల ప్రచారంలో గుంటూరు ఛానల్ పొడిగింపు, విస్తరణ చేపట్టి తీరుతామని, ప్రజలకు ఇచ్చిన హామి మేరకు తొమ్మిది నెలల పాలనలో బడ్జెట్‌లో నిధుల కేటాయింపు కోసం వారికృషి ప్రజలు ఎన్నటికీ మరచిపోలేరన్నారు.

నిధులు కేటాయించడంపై హర్షం

నల్లమడ రైతు సంఘ జిల్లా నేత కొల్లా రాజమోహనరావు

పెదనందిపాడు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు ఛానెల్ పొడిగింపునకు బడ్జెట్‌లో 100 కోట్ల రూపాయల నిధులు భూసేకరణకు కేటాయించడం హర్షణీయమని, వెంటనే పనులు ప్రారంభించాలని నల్లమడ రైతు సంఘ జిల్లా నేత కొల్లా రాజమోహనరావు అన్నారు. స్థానిక సోమేశ్వరస్వామి కాలక్షేప మండపంలో సోమవారం నల్లమడ రైతు సంఘ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత చిరకాల వాంఛ అయిన గుంటూ


సమావేశంలో మాట్లాడుతున్న కొల్లా రాజమోహనరావు

రు ఛానెల్‌కు నిధుల కేటాయింపునకు కృషి చేసిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుకు, నిధులు విడుదల చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌లకు కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘ నాయకులు యార్లగడ్డ అంకమ్మచౌదరి, లావు అంకమ్మచౌదరి, మన్నవ హరిప్రసాద్, రావి శివరామకృష్ణయ్య, పోతినేని వేణు, కొల్లా నిర్మల, కొల్లా రామన్, లావు చౌడేశ్వరి, దివ్వి ప్రమీల, దొప్పలపూడి మంజూష, పెద్ది ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత ఆశయాలతో విజయపథంలో నడవాలి : సీఐ

పెదనందిపాడు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులు ఉన్నత ఆశయాలతో చదివి విజయపథంలో నడవాలని ప్రత్తిపాడ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. మహిళా ది


పోలీసు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ గన్నవరపు శ్రీనివాసరావు

నోత్సవంలో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్లో సోమవారం విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే యాజమాన్యంతో మాట్లాడి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. సోషల్ మీడియా, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే మత్తుపదార్థాలపై కూడా అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో ఇబ్బందుల్లో ఉంటే వెంటనే పోలీసుసేషన్‌కు కానీ, డయల్ 100కు, టోల్‌ఫ్రీ నంబరు 1930 నంబరుకు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మధు పవన్, సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

ఫిరంగిపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఫిరంగిపురంలో సోమవారం మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బాల్య వివాహాలను నిర్మూలించాలంటూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ఐసీడీఎస్ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సీహెచ్ వెంకటేశ్వరమ్మ, సునీత, టీ.హేమలత, సీహెచ్ మహాలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలగా ఎంపీపీ పాఠశాల : ఎంఈవో

కాకుమాను, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కాకుమాను మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఇతర ప్రభుత్వ పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తుందని మండల విద్యాశాఖాధికారి కేఏఫ్ కెన్నడీ అన్నారు. స్థానిక ఎంపీపీ పాఠశాలను సోమవారం వార్షిక తనిఖీ చేశారు. ఎంపీపీ పాఠశాలలో 105 మంది విద్యార్థులు ఉండడం, ఉదయం 8 గంటలకే ఉపాధ్యాయులు, పాఠశాలకు చేరుకుని విద్యాబోధన చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. వలంటీర్‌ల సహాయంతో సాయంత్రం అదనపు తరగతులు నిర్వహించడం, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నిర్వహణ చేస్తున్న ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ తనిఖీలో ఈవూరి శ్రీనివాస్, కోటేశ్వరరావు, సీఆర్పీలు జమాయమ్మ, చలపతి, సురేంద్ర, హెచ్‌ఎం మాధవి, సంధ్యారాణి, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు : ఏడీఏ


కాకుమాను పురుగు మందుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

కాకుమాను, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఎరువుల దుకాణ యజమానులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని పొన్నూరు సబ్ డివిజన్ ఏడీఏ రామకోటేశ్వరి అన్నారు. కాకుమానులో సోమవారం లక్ష్మీ ప్రసాద్ ఫర్టిలైజర్స్, మహాలక్ష్మీ ఏజన్సీస్, వినాయక పెస్టిసైడ్స్ ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఎరువుల స్టాకు, పురుగు మందుల గడువులను క్షుణ్ణంగా పరిశీలించారు. దుకాణాలకు సంబంధించి లైసెన్స్, ఫాంఒ, ఇన్‌వాయిస్‌లు, ప్రిన్సిపల్ సర్టిఫికెట్‌లు, స్టాక్‌లను తనిఖీ చేశారు. దుకాణాలలో కొనుగోలు చేసిన ప్రతి రైతుకు బిల్లులు ఇవ్వాలని, అలాగే బిల్లులపై రైతు సంతకం తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు. ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో ఏవో కిరణ్మయి, దుకాణ యజమానులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో చర్చి నిర్మాణానికి శంకుస్థాపన

మంగళగిరి సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలో నూతనంగా నిర్మించనున్న లూథరన్ చర్చి నిర్మాణానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, మండల కార్యదర్శి జాన్‌బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, పంతగాని మరియదాసు, టీడీపీ నేతలు కే.చిరంజీవి, కొమ్మా లవకుమార్, లూథరన్ సంఘం పాస్టర్లు, పెద్దలు పాల్గొన్నారు.

లూథరన్ చర్చి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ముప్పాళ్ల నాగేశ్వర రావు



బాల్య వివాహాలను సమూలంగా నిర్మూలిద్దాం

ప్రత్తిపాడు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలను సమూలంగా నిర్మూలించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భారతి, మాధవి తెలిపారు. మండల పరిధిలోని గొట్టిపాడు, ప్రత్తిపాడు గ్రామాలలోని అంగన్వాడీ కేంద్రాలలో అంత


గొట్టిపాడులో బాల్యవివాహాలపై ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి

ర్జాతీయ మహిళా దినోత్సవాలలో భాగంగా బాల్యవివాహాల నిర్మూలనపై కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నిర్మూళనకు తీసుకోవలసిన చర్యలతో పాటు, బాల్య వివాహాల వలన కలిగే నష్టాలను వివరించారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమాలలో అంగన్వాడీ కార్యకర్తలు ఏ.వెంకాయమ్మ, పీ.కుసుమ పాల్గొన్నారు.

పెదనందిపాడులో...

పెదనందిపాడు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) :బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. స్థానిక దక్షిణ బజార్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు బాల్యవివాహాలపై అవగాహనా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మగ, ఆడ అనే వివక్ష లేకుండా ఇద్దరినీ సమానంగా హక్కులు కల్పించాలన్నారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సక్రమంగా తల్లులకు పంపిణీ చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. అనంతరం ఆడపిల్లలను రక్షిద్దాం, ఆడపిల్లలను చదివిద్దాం, ఆడపిల్లే ఇంటికి వెలుగు అంటూ తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసు మానస పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన
మా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, గుంటూరు-2 బ్రాంచ్ వారి సూచనలు పొంది యిందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా... **చోడవరపు సుబ్రహ్మణ్యం** గారి కుమారుడు **చోడవరపు ఆనంద రవితేజ** గారి ఆస్తిని తనఖా పెట్టుకొని ఋణము పొందుటకు సంప్రదించినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తితి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు, క్లయిములు ఉన్నచో 7 రోజులలోపు తెలియచేయవలయును. ఎట్టి అభ్యంతరములు, క్లయిములు రానిచో మా క్లయింట్ సదరు **చోడవరపు ఆనంద రవితేజ** గారికి ఋణం మంజూరు చేయును. **షెడ్యూలు** : నరసరావుపేట ఆర్.డి., డిటో సబ్.డి.లో చేరిన పాత గుంటూరు జిల్లా, (కొత్తగా ఏర్పడిన పల్నాడు జిల్లా) నరసరావుపేట మండలం, యల్లమంద గ్రామ పంచాయితీకి చెందినట్టి, యల్లమంద గ్రామం తాలూకు నీకు విక్రయించిన ఆస్తి వివరం. యల్లమంద గ్రామ డి.నెం. 790-2రు మింజుమలై సీకు విక్రయించిన ఖాళీ స్థలమునకు హద్దులు **తూర్పు** : పోతినేని పూర్ణచంద్రరావు గారి ఆస్తి హద్దు అ. 68లు, **దక్షిణం** : మాసుకొండ మాధవరావు మాగాల భూమి హద్దు అ. 29-8లు, **పడమర** : రాకపోకల కొరకు వదిలిన బాట హద్దు అ. 68లు, **ఉత్తరం** : పంచాయితీ బజారు హద్దు అ. 30లు. ఈ హద్దుల మధ్య చ.గ. 225-40లకు సరియగు చ.మీ. 189-22లు ఖాళీ స్థలమున్నూ. DOC NO: 9716/2024, S.R.O. నరసరావుపేట.
లంకా విజయ్‌కుమార్, లంకా వంశీక్రిష్ణ,
న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు.
సెల్ నెం.9030595227, 9848052914

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి 99854 11227 99854 02292

మసీదుల వద్ద పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు


మసీదుల వద్ద పారిశుధ్య సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ రమేష్‌బాబు

పొన్నూరుటౌన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మసీదుల వద్ద పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు తెలిపారు. పొన్నూరు పట్టణంలోని డఫ్‌పేట, ఎస్పీటీ రోడ్డు, ఇటికంపాడు రోడ్డు వంటి పలు ప్రధానరహదారుల్లో ఉన్న మసీదులను సోమవారం కమిషనర్ రమేష్‌బాబు పరిశీలించారు. మసీదుల వద్ద రంజాన్‌మాసం సందర్భంగా ప్రతిరోజూ ప్రత్యేక ప్రార్థనలు జరుగుతున్న నేపథ్యంలో మసీదు పెద్దలను కలిసి సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రధానంగా మసీదుల వద్ద వీధులు శుభ్రంచేయడం, చెత్తను తొలగించడం, వీధుల్లో విద్యుత్‌దీపాలు మరమ్మతులు వంటి సమస్యల గురించి మసీదు పెద్దలు తెలియజేశారు. ఆ సమస్యలను కమిషనర్ రమేష్‌బాబు తక్షణమే పరిష్కరించారు, ప్రతిరోజూ నమాజ్ ప్రారంభం కాకముందే వీధులు శుభ్రం చేయడం, బ్లీచింగ్ చల్లించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని పారిశుధ్య అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మసీదు పెద్దలు, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

వైద్యుల సలహాలు పాటించాలి

● మండల వైద్యాధికారి సుమంత్

కొల్లిపర, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): బీపీ, షుగర్ వ్యాధిగ్రస్థులు వైద్యుల సలహాలు, సూచనల మేరకు మందులను వాడుకోవాలని మండల వైద్యాధికారి సుమంత్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని పిడపర్రులో వైద్యాధికారులు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ బీపీ, షుగర్ వ్యాధిగ్రస్థులు ప్రతి నెల వైద్య పరీక్షలను తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ప్రతి నెల నిర్వహించే ఎఫ్‌పీసీ క్యాంపులో మంచంలో ఉన్న వారికి కూడా ఇంటికి వెళ్ళి వైద్యసదుపాయం కల్పించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ సుభాషిని, ఏఎన్ఎం బేగం, డీఈవో బొమ్ము కోటిరెడ్డి, ఆషా కార్యకర్తలు ప్రసన్న, హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో లోహితాక్ష ప్రతిభ


బహుమతితో లోహితాక్ష

పొన్నూరుటౌన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఆల్ఇండియా జాతీయస్థాయి కరాటే పోటీల్లో పొన్నూరు పట్టణానికి చెందిన లోహితాక్ష ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నట్లు కోచ్ ఉమామహేశ్వరరావు సోమవారం తెలిపారు. ఇటీవల చిలకలూరిపేటలో జరిగిన జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ ఆల్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్న లోహితాక్ష పలు ప్రాంతాలకు చెందిన క్రీడాకారులను కటా, కుమితే పోటీలలో ఓడించి జాతీయస్థాయి రెండో బహుమతి సాధించినట్లు తెలిపారు. లోహితాక్షను శ్రీచాణక్య స్కూల్ నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించారు.

బాలయోగికి ఘన నివాళి

పెదకాకాని, మార్చి 3(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి 23వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ పెదకాకాని మండల కార్యాలయంలో బాలయోగి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ శిఖరం సావిత్రీబాయి పూలే

● డాక్టర్ కత్తి పద్మారావు

పొన్నూరుటౌన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మహిళల ఆత్మగౌరవ శిఖరానికి ప్రతీకగా సావిత్రీబాయి పూలే నిలిచారని ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ వ్యవస్థాపకుడు డాక్టర్ కత్తి పద్మారావు అన్నారు. సోమవారం పట్టణంలోని లుంబినీ వనంలో సావిత్రీబాయి పూలే పుస్తక ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ పద్మారావు మాట్లాడుతూ మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సావిత్రీబాయిపూలే గ్రంథ పరిచయ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండే నాగేశ్వరరావు, దేవరపల్లి రవికుమార్, మాతంగి పెద్దబ్బాయి, కర్రా అంబేద్కర్, గేరా ప్రసన్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత అధ్యాపకుడు బాపయ్యగుప్తా మృతి

పొన్నూరుటౌన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని విశ్రాంత అధ్యాపకుడు జి.బాపయ్యగుప్తా(75) సోమవారం మృతిచెందాడు. బాపయ్య గుప్తా పొన్నూరు పట్టణంలోని వీబీఎన్ కళాశాలలో 35 ఏళ్ల పాటు కామర్స్ అధ్యాపకుడిగా పనిచేశారు. బాపయ్యగుప్తా మృతి వార్త తెలుసుకున్న కళాశాల పూర్వవిద్యార్థులు, పట్టణ ప్రముఖులు ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వ్యర్థ జలాలతో పొంచివున్న ముప్పు

● కలుషితమవుతున్న తాగునీరు

● ఆందోళనలో అంగలకుదురు గ్రామస్థులు


అంగలకుదురులో మట్టి కాలువలో ప్రవహిస్తున్న వ్యర్థ జలాలు, పక్కనే నివాసాలు


తెనాలి నుంచి సిమెంట్ కాలువ ద్వారా అంగలకుదురు వైపు వస్తున్న కలుషితమైన నీరు

తెనాలి రూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణంలోని పలు వార్డుల వ్యర్థ జలాలతో పాటు తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాల నుండి వచ్చే వ్యర్థ జలాలు డ్రెయిన్ల ద్వారా ప్రవహించి అంగలకుదురుకు చేరుతున్నాయి. బోరు వాటర్‌తో ఈ గ్రామస్తులు దాహార్తిని తీర్చుకుంటున్నారు. డ్రెయిన్ల గుండా వచ్చిన వ్యర్థ జలాలు భూమిలో ఇంకి అంగలకుదురు గ్రామంలో భూగర్భజలాలు కలుషితమై తాగునీరు కాలుష్యం అవుతున్నది. నీరు కాస్త నురుగుగా వస్తూ గ్రామస్తులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అనేక మార్లు గ్రామంలోకి వచ్చే వ్యర్థజలాలు శుద్ధిప్లాంట్ల ద్వారా శుభ్రపరిచి వదలాలని వేడుకున్నా అధికారుల్లో మాత్రం చలనం రాలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పట్టణానికి ఆనుకుని ఉన్న అంగలకుదురు డ్రెయిన్లకు కలుషితమైన నీరు నేరుగా పంపడంతో దోమలు వృద్ధి చెందడంతోపాటు దుర్గంధం వెదజల్లుతూ పంటభూములు సైతం కలుషితమవుతున్నాయని రైతులు వాపోతున్నారు. గతంలో ఎన్నడూ గ్రామంలో పెద్దపెద్ద అనారోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యేవి కాదని, కొంతకాలంగా క్యాన్సర్ బారిన పడేవారు పెరుగుతున్నారని, ఇదే కొనసాగితే గ్రామంలో ప్రజలు నివసించే పరిస్థితి ఉండదని చెబుతున్నారు. జేఎంజే కళాశాల వరకూ పట్టణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా కాంక్రీట్‌తో డ్రెయిన్లు నిర్మించి తమ గ్రామానికి వచ్చే నీటిని మాత్రం మట్టి కాలువల ద్వారా సరఫరా చేయడం దారుణమంటున్నారు. అధికారులు ఆ వ్యర్థజలాలు వెళ్లే గ్రామ కాలువను కాంక్రీట్‌తో నిర్మాణం చేపట్టి భూమిలోకి ఆ నీరు ఇంకకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉపాధి పనిలో మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

● ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అప్పారావు


మృతుల కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

కొల్లిపర, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులకు వెళ్ళి మృతి చెందిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని దావులూరులో ఉపాధిహామీ పని చేస్తూ మృతి చెందిన నిశంకర సాంబశివరావు, గమిడి శివమ్మ కుటుంబ సభ్యులను ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ మృతుల కుటుంబ సభ్యులకు ఒక్కొక్క కుటుంబానికి రూ.25లక్షలు నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ ఉపాధిహామీ పనులకు వెళ్ళి మృతిచెందిన వారు పేద కుటుంబానికి చెందిన వారని ఇప్పటివరకు ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో భార్గవ్‌కు మృతుల కుటుంబ సభ్యులను ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు కోటా చంద్రశేఖర్, జిలుగు ముక్కంటి, ఎ.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు లోకేశ్ పెళ్లికానుక


మంత్రి లోకేశ్ నూతన దంపతులకు పంపిన పెళ్లికానుకను అందిస్తున్న టీడీపీ నాయకులు

తెనాలి రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కత్తెర సురేష్‌కుమార్ దంపతుల కుమార్తె వివాహాన్ని పురస్కరించుకుని మంత్రి నారా లోకేశ్ పెళ్లికానుక పంపి ఆశీస్సులు అందించారు. సోమవారం తెనాలి పట్టణంలోని చావాస్ గ్రౌండ్‌లో కత్తెర క్రిస్టీనా, సురేష్‌కుమార్ దంపతులు కుమార్తె మెర్సీప్రిస్కిల్లా, ఉమేష్‌చంద్రల వివాహం వైభవంగా నిర్వహించారు. వివాహ వేడుకలకు హాజరు కావాల్సిన నారా లోకేశ్ అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో రాలేకపోయారు. దీంతో తెనాలి పార్టీ నాయకులతో పెళ్లికానుకను పంపించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి, రావి చిన్ని, మహ్మద్‌కుద్దుస్, మల్లవరపు విజయ్ కుమార్, కోగంటి వెంకటేశ్వరరావు, భాస్కర్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు చిన్నారి అప్పగింత

తెనాలి క్రైం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఇంట్లో తల్లిదండ్రులు మందలించారని అలిగి వెళ్ళిన చిన్నారి తిరిగి క్షేమంగా వారి తల్లిదండ్రుల చెంతకు తెనాలి జీఆర్‌పీ పోలీసులు అప్పగించిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. తెనాలి జీఆర్‌పీ ఎస్ఐ వెంకటాద్రి తెలిపిన వివరాలు మేరకు తెనాలి నాజర్‌పేట పుట్టావారి వీధికి చెందిన తొమ్మిది సంవత్సరాల బాలుడు తల్లిదండ్రులు కోప్పడ్డారని ఇంట్లో చెప్పకుండా తెనాలి నుంచి రైలు ఎక్కి రేపల్లె స్టేషన్‌కు చేరుకున్నాడు. ప్లాట్‌ఫాంపై ఒంటరిగా ఉన్న బాలుడిని గుర్తించిన జీఆర్‌పీ పోలీసులు వేణు, గోపి బాలుడిని చేరదీసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐ వెంకటాద్రికి విషయం తెలిపి బాలుడు తెలిపిన వివరాలు ప్రకారం ఎస్ఐ సిబ్బందిని పంపించి తల్లిదండ్రుల చిరునామా తెలుసుకుని రేపల్లె స్టేషన్ నుంచి బాలుడిని తీసుకుని వచ్చి సోమవారం రాత్రి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో రైల్వే పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

సత్వర కేంద్రం సేవలపై అవగాహన ఏదీ..?

● చిన్నారులకు తక్షణ వైద్యం అందించేలా ఏర్పాట్లు

● ప్రారంభించి సంవత్సరం పూర్తవుతున్నా సేవలు అంతంతే

● అవగాహన కల్పిస్తే పేద పిల్లల ఆరోగ్యానికి భరోసా



తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో నిర్మించిన బాలల సత్వర చికిత్సా కేంద్రం

తెనాలి రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు నాణ్యమైన వైద్యసేవలందించి వారిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్ది శిశుమరణాలను పూర్తిగా అరికట్టేలా రాష్ట్రీయ స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ద్వారా తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో బాలల సత్వర చికిత్స కేంద్రాన్ని ఏర్పాటుచేసి ప్రారంభించారు. దీని ద్వారా చిన్నారులకు సంబంధించి వివిధ అనారోగ్య సమస్యలైన తల, చెవులు, గ్రహణం మొర్రి పెదవిచీలిక, వంకర పాదాలు, పుట్టుకతో చెవుడు, పెద్ద శబ్దాలకు స్పందించకపోవడం, సంక్రమిత గుండె జబ్బులు, తలచుట్టూ చెమట పట్టడం, చర్మం, పెదాలు, పాదాలు, గోర్లు నీలిరంగులో ఉండటం, త్వరగా అలసిపోవడం, మట్టి తినడం, గాయిటర్, మెడ లేదా గొంతు భాగంలో గడ్డ, చర్మవ్యాధులు వంటి చికిత్సలు, నాడీ సంబంధిత సమస్యలకు కూడా వైద్యసేవలందించడం, అత్యవసర సేవలను పిల్లలకు మరింత చేరువ చేయడం కోసం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో చిన్నారులకు వైద్యసేవలందించేందుకు వైద్యులు, సిబ్బందిని సైతం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో చిన్నారులకు వైద్యశాలలో ఉన్నామన్న ఆలోచన కలుగకుండా చుట్టూ పిల్లలను ఆకర్షించేలా పలు రకాల బొమ్మలను గోడలకు నిండుగా వేసి చూడముచ్చటగా తీర్చిదిద్దారు. అంతేకాకుండా చిన్నారులు ఆటలాడుకునేందుకు పార్కులో ఉండే ఆట వస్తువులను సైతం ఇందులో ఏర్పాటుచేశారు. పేద పిల్లల ఆరోగ్యానికి కార్పొరేట్ వైద్యశాలలకు దీటుగా వైద్యం అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాన్ని ప్రారంభించి సంవత్సరాలు దాటుతున్న సేవల్లో మాత్రం అంతంత మాత్రంగానే ఉందన్న ఆరోపణలు పలువురి నుంచి వ్యక్తమవుతున్నాయి. ఇందుకు ప్రధానంగా ప్రజల్లో అవగాహన కల్పించడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైనట్లు విమర్శలున్నాయి. చిన్నారుల్లో వచ్చే అనేకరకాల అనారోగ్య సమస్యలకు ఎంతో ఖరీదైన వైద్యాన్ని చేరువ చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంకణం కట్టుకుని వాటిని ఏర్పాటుచేస్తే ఆ ఆశయాన్ని నెరవేర్చేలా అధికార యంత్రాగం కూడా ముందడుగు వేస్తే పేదల పిల్లలకు పూర్తి ఉచితంగా అందుతుంది. ప్రభుత్వానికి మంచి పేరు రావడంతో పాటు ఎందరో చిన్నారులు ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడిపే అవకాశం ఉంటుంది. సత్వర కేంద్రం సేవలపై అవగాహన పెంచి దీనిని సద్వినియోగం చేసుకునేలా చూడాలని పలువురు కోరుతున్నారు.


సత్వర చికిత్సా కేంద్రంలో చిన్నారుల కోసం ఏర్పాటుచేసిన ఆట వస్తువులు

చెత్తను జీవీపీలోనే వేయాలి

● మునిసిపల్ కమిషనర్ శేషన్న


శానిటేషన్ సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ శేషన్న తదితరులు

తెనాలి మారీసుపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు తమ ఇంటి నుండి వచ్చే చెత్తను గార్బేజ్ వెహికల్ పాయింట్ (జీవీపీ)లోనే వేయాలని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. సోమవారం పట్టణంలోని 1వ డివిజన్‌లో జరుగుతున్న చెత్త తొలగింపు పనులను క్షేత్రస్థాయిలో అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డు ప్రజలు తమ ఇంటి నుంచి వచ్చే చెత్తను వ్యర్థాలను వార్డులో ఏర్పాటుచేసిన గార్బేజ్ వెహికల్ పాయింట్ (జీవీపీ)లోనే వేయాలని ఆ వ్యర్థాలను పారిశుధ్య కార్మికులు డంపింగ్ యార్డు కు తరలిస్తారని తెలిపారు. చెత్తను జీవీపీలో వేసేలా మునిసిపల్ అధికారులు ప్రజలకు అవగాహన కలిపించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. పట్టణాన్ని సుందర తెనాలిగా తీర్చిదిద్దేందుకు ప్రజలు శానిటేషన్ సిబ్బందికి సహకరిస్తూ ఇంటాబయటా వచ్చే చెత్తను మూడు బుట్టల విధానం ద్వారా పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. స్వచ్ఛ తెనాలి సాధించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

● సీడీపీవో డాక్టర్ సునీత


మాట్లాడుతున్న సీడీపీవో డాక్టర్ సునీత, సెక్టార్ సూపర్‌వైజర్ నాగమణి తదితరులు

తెనాలి మారీసుపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో డాక్టర్ ఎం.సునీత అన్నారు. సోమవారం స్థానిక 31వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు తెనాలి శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీవో డాక్టర్ ఎం. సునీత పాల్గొని బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండకుండా అమ్మాయిలకు 21 సంవత్సరాలు నిండకుండా అబ్బాయిలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అంతేగాక వివాహం చేసిన వారు వివాహానికి హాజరైన వారు కూడా శిక్షార్హులన్నారు. బాల్య వివాహాలు వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలను వ్యతిరేకిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ వై.నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు శాంతకుమారి, రాహేలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

చిన్నారులతో వివాహిత అదృశ్యం

తెనాలి మారీసుపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తన ఇద్దరు చిన్నారులతో సహా వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక మారీసుపేటకు చెందిన పోతార్లంక శివయ్య, యామినిలు భార్యాభర్తలు. వీరికి ఇరువురు చిన్నారులు గీతామాధురి (9), రియా (6) ఉన్నారు. ఈ క్రమంలో ఆదివారం యామిని తన ఇద్దరు చిన్నారులను తీసుకొని బజారులో పని ఉందని భర్త శివయ్యతో చెప్పి వెళ్లింది. పొద్దుపోయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో తెలిసిన వారిని, బంధువులను విచారించగా వారి ఆచూకీ తెలియలేదు. దీంతో ఆమె తల్లి మల్లేశ్వరి, తన కుమార్తె, ఇద్దరు మనుమరాళ్లు కనిపించడంలేదని పోలీసులను ఆశ్రయించింది. సోమవారం యామిని తల్లి మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాడి రైతుల సంక్షేమం కోసం డీవీసీ అభయ

● పాలకవర్గ సభ్యుడు బొర్రు రామారావు


బాధిత కుటుంబానికి పరిహారం అందజేస్తున్న సంగం డెయిరీ డైరెక్టర్ రామారావు

పొన్నూరు టౌన్, మార్చి, 3 (ఆంధ్రజ్యోతి): సంగం డెయిరీ పరిధిలోని పాల రైతుల సంక్షేమానికి పాలకవర్గం పాటుపడుతోందని ఆ సంస్థ పాలకవర్గ సభ్యుడు బొర్రు రామారావు అన్నారు. మండల పరిధిలోని ములుకుదురులో సోమవారం మృతిచెందిన పాలరైతు కుటుంబానికి ఆర్థిక పరిహారం అందించారు. ఇటీవల పాల రైతు నందలం వెంకటేశ్వర్లు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. సంగం డెయిరీ, డీవీసీ అభయ పథకంలోని పొడ్యూసర్స్ వేల్ఫేర్ పథకం ద్వారా చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ వెంకటేశ్వర్లు కుటుంబానికి రూ.50వేల ఆర్థిక పరిహారం మంజూరు చేశారు. ఈ నగదు చెక్కును వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులకు డైరెక్టర్ రామారావు అందజేశారు. అలాగే పశుగ్రాస పెంపు ప్రోత్సాహం కింద ములుకుదురు రైతు దాసరి సుబ్బారావుకు రూ.7500ల నగదు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ సంగం డెయిరీ అభివృద్ధిలో భాగస్వామ్యులైన రైతుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను చైర్మన్ నరేంద్రకుమార్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని పాడిరైతులు పథకాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో సంగం డెయిరీ జోనల్ మేనేజర్ వీరేంద్రకుమార్, సూపర్‌వైజర్ బాలకిషోర్, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

వినికిడి లోపం రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

● ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి

తెనాలి రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వినికిడి లోపాలు రాకుండా చెవుల సంరక్షణపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి చెప్పారు. సోమవారం పట్టణంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని పురస్కరించుకుని చెవుల సంరక్షణ, వినికిడి లోపాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి ఈఎన్‌టీ వైద్యుడు డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ మధ్య వినికిడి సమస్యలకు ప్రధాన కారణంగా సెల్‌ఫోన్ అధికంగా మాట్లాడటం, ఇయర్ ఫోన్స్ ద్వారా ఎక్కువ సమయం వినడం ద్వారా చెవులకు ఉన్న నరాలు రేడియేషన్ ప్రభావంతో దెబ్బతిని వినికిడి లోపాలు వస్తున్నాయన్నారు. తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో వినికిడి పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. వైద్యశాలలో ఉచిత పరీక్షలు, మందులు, అవసరమైన వారిని శస్త్రచికిత్సలు కూడా చేయడం జరుగుతుందన్నారు. సివిల్ సర్జన్ డాక్టర్ జె.శ్రీనివాసరావు, పీజీ వైద్యులు, ఆడియాలజిస్టులు నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

గుంటూరు జిల్లా, పొన్నూరు మండలం, చింతలపూడి గ్రామం నుండి పొన్నూరులో జిరాక్సు కాపీలు తీసుకొనేందుకు ది.10-02-2025వ తేదీన వస్తుండగా (1) ధూళిపాళ్ళ ప్రమీలాదేవి గారి పేరిట మండదం సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయములో నెం. 2809/2018 గా ది.11-04-2018న రిజిష్టరు అయిన విక్రయ దస్తావేజు (2) ధూళిపాళ్ళ ప్రమీలాదేవి గారి పేరిట మండదం సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయములో నెం. 2810/2018 గా ది.11-04-2018న రిజిష్టరు అయిన విక్రయ దస్తావేజులు చింతలపూడి గ్రామ పొలిమేరలో మోటారు సైకిలు ట్యాంకు కవరు నుండి జారీ పడిపోయినవి. సదరు దస్తావేజులు ఎవరికైనను దొరికినట్లయితే వాటిని వెంటనే ఈ క్రింది పేర్కొన్న ఫోను నెంబరుకు తెలియపరచి అప్పగించగలరు. సదరు దస్తావేజులు దొరికినవారు వాటిని ఏవిధముగానైనా దుర్వినియోగ పరచినట్లయితే సదరు చర్యలకు పాల్పడినవారు సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులు కాగలరు. మరియు సదరు లావాదేవీలు దస్తావేజు యజమానులను చట్ట ప్రకారం బైండు చేయజాలవు. కావున యావన్మందికి తెలియపరచటమైనది.

రాచర్ల ధర్మారావు, 15-5-8, పీవర్సు కాలనీ, పొన్నూరు, ఫోన్ నెం: 94907 95561

ఆయుర్వేద వైద్యశాలను సద్వినియోగం చేసుకోండి

● డాక్టర్ హిమబిందు


డాక్టర్ హిమబిందు

తెనాలి రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద వైద్యశాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంగం జాగర్లమూడి వైద్యురాలు డాక్టర్ హిమబిందు అన్నారు. సోమవారం సంగంజాగర్లమూడి పీహెచ్‌సీలో ఉన్న ఆయుర్వేద వైద్యశాల సేవలపై ఆమె మాట్లాడారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ఆయుర్వేద మందులు రోగ నిరోధక శక్తిని పెంచి దానిబారిన పడకుండా కాపాడాయన్నారు. బీపీ, షుగర్, రక్తహీనత, వాపులు, నొప్పులు, ఇలా అన్నింటికీ ఆయుర్వేదంలో మంచి వైద్యంతో పాటు మందులు కూడా ఉన్నాయన్నారు. అనారోగ్య సమస్యలున్న వారు పూర్వీకుల నుంచి వచ్చిన ఆయుర్వేద వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.